RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:17 SUNDAY,JUNE 14,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :17 ఆదివారం, జూన్ 14, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్..

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు రూ.50 వేల జరిమానా
- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు హైకోర్టు ఆగ్రహం
- యూసఫ్‌గూడ భూవివాదంలో యథాతథస్థితి ఉల్లంఘన
- జరిమానా చెల్లించాకే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

**తెలంగాణ పత్రిక:** భూవివాదానికి సంబంధించిన కేసులో కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు రూ. 50 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ కింద ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని -2లో



## కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు

జిల్లా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటాం
- కాపాడుకుంటాం
- సింగరేణి సంస్థ - తెలంగాణ ప్రజల ఆస్తి

**తెలంగాణ పత్రిక:** సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి.,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,రాష్ట్ర షెడ్యూల్ తెగలు,గిరిజన,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,గడ్డం వినోద్, సత్యనారాయణ- మిగతా2లో

**మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు.. 335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి** 2



## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం

కేబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం..

60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు..

వివరాలు2లో



## కోవర్టుల సంగతి తేలుస్తాం

వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్

- మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత
- అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

## భారీ వర్ష సూచన

"కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో హై అలర్ట్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ పత్రిక:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరా బాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటిం చాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించా లని ఆదేశించారు. వర్షాల వల్ల నగర వాసులకు -మిగతా2లో

### జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం

జర్నలిస్టులకు సొసైటీల పేరుతో కాకుండా ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 3

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు



- తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
- తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు
- తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్

**తెలంగాణ పత్రిక:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యం లో సిట్ విస్తృత -మిగతా2లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్



- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు 2
- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

## బైక్‌పై ల్యాప్‌టాప్‌తో పని



- బైక్‌పై వెళుతూ ల్యాప్‌టాప్‌లో పనిచేస్తున్న వీడియోను షేర్ చేసిన సజ్జనార్
- 'వర్క్ ఫ్రమ్ బైక్' అంటూ ప్రాణాలతో చెలగాటమాడొద్దని హెచ్చరిక
- ఏకాగ్రత తప్పితే మీకే కాదు, ఇతరులకూ ప్రమాదమని హితవు
- పొట్టకూటి కోసం చేసే పని ప్రాణాలు తీసేలా ఉండకూడదని వ్యాఖ్య

3

### పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ పురస్కారం

- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు
- కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక

2

### హైదరాబాద్‌లో అక్రమ నివాసం..

## ఏడుగురు విదేశీయులు అరెస్ట్..



- జీడిమెట్ల ప్రాంతంలోని గాజులరామారంలో అద్దె ఇంటిపై దాడులు
- ఎలాంటి పత్రాలు లేకుండా నివసిస్తున్న బంగ్లాదేశీయులు
- జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలింపు

**తెలంగాణ పత్రిక:** బంగాదేశ్ నుంచి వచ్చిన అక్రమంగా నగరంలో నివాసం ఉంటున్న ఏడుగురు విదేశీ పౌరులను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజుల రామారం హెచ్ఏఎల్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో వీరిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారుబంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఏడుగురు విదేశీయులను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి -మిగతా3లో

## దుబాయ్ నుంచి బంగారం అక్రమ రవాణా

3



### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

-రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
-ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
లైబ్రరీకి 10 లక్షల రూపాయలు మంజూరు
-రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**తెలంగాణ పత్రిక:** జిల్లా ఆదివాసీల ఆచార సంప్రదా యాలు దేశానికి ఆదర్శమని,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటు 2లో

# కోవర్టుల సంగతి తేలుస్తాం..

**-మొదటి పేజీ తరువాయి:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్టులను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్..

**-మొదటి పేజీ తరువాయి:** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మండలం, యూసఫ్‌గూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఉన్న రెండెకరాల భూవివాదంపై మహ్మద్ షఫాహతుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో న్యాయస్థానం యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు ప్రహరీ గోడ కూల్చివేసి, కంచె ఏర్పాటు చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై తాజాగా జరిగిన విచారణలో, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి చివరి అవకాశం ఇచ్చినా 'హైడ్రా' స్పందించకపోవడంపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేటస్ కోను ఉల్లంఘించడాన్ని తప్పుబడుతూ కమిషనర్‌కు జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్‌కు చెల్లించాలని, ఆ తర్వాతే కేసులో కౌంటర్ అఫిడవిట్‌ను స్వీకరించాలని రిజిస్ట్రీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## భారీ వర్ష సూచన..

**-మొదటి పేజీ తరువాయి:** వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ , హైడ్రా, విద్యుత్ శాఖ , వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ , స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

**-మొదటి పేజీ తరువాయి:** ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

**-మొదటి పేజీ తరువాయి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు

**-మొదటి పేజీ తరువాయి:**
శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి.,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు,గిరిజన,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి,వైరా నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనా రాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు.సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని,30 వేల మంది ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు.కోల్ బ్లాక్స్‌లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు.కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఐ.టి.శాఖ మంత్రి మాట్లాడుతూ...సింగరేణి సంస్థను, తెలంగాణ నల్ల బంగారం బొగ్గును కాపాడుకుందాం అని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మెడికల్ అన్ ఫిట్ విషయంలో పారదర్శకంగా ముందుకు వెళదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల రూపాయలతో పాటు ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి 40 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు.సింగరేణి సంస్థ లాభాలలో సింగరేణి కార్మికులతో పాటు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా అందించడం జరిగిందని తెలిపారు.మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సింగరేణి సంస్థలో మారుపేరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని,ఒక కమిటీని నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని, బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు.రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాలలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను పదవీ విరమణ పొందిన కార్మికులకు అందించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్నులు వెసలుబాటు కల్పించాలని,జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో గల శ్రీరాంపూర్ ప్రాంతంలో అర్హులకు పట్టాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బెల్లంపల్లి శాసన సభ్యులు మాట్లాడుతూ 1992లో సింగరేణి సంస్థను 450 కోట్ల రూపాయలకు బి ఐ ఎఫ్ ఆర్ క్రిందకు పంపించడాన్ని ఆనాడు గడ్డం వెంకటస్వామి అడ్డుకొని కాపాడారని గుర్తు చేశారు. కార్మికులకు సింగరేణి లాభాలలో వాటా ఇప్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం అర్హులైన సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు,సింగరేణి సంస్థ అధికారులు,సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం: మంత్రి సీతక్క

**-మొదటి పేజీ తరువాయి:** కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క ఈరోజు (శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

**కేబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం..**

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంభిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హామీ ద్వారా చేపడుతామని తెలిపారు.

**60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు..**

పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు..

**-మొదటి పేజీ తరువాయి:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఇవాళ కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

**-మొదటి పేజీ తరువాయి:** జిల్లా ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు నైతం కవిత–సోము, తొడసం సుదర్శన్–మధుబాయి, సీతాబాయి–దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యాభివృద్ధికి ప్రాధాన్యం**

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు,సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు.రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి,ప్రజాప్రతి నిధులు,వివిధ శాఖల అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు

**-మొదటి పేజీ తరువాయి:** పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# బైక్‌పై ల్యాప్‌టాప్‌తో పని..

-మొదటిపేజీ **తరువాయి:** హైదరాబాద్ నగరంలో కొందరు యువకులు ప్రదర్శిస్తున్న అత్యుత్సాహంపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్ నడుపుతూనే ల్యాప్‌టాప్‌లో ఆఫీస్ పనులు చేస్తూ, ప్రాణాలను పణంగా పెడుతున్న ఓ యువకుడి తీరును ఆయన సోషల్ మీడియా వేదికగా తప్పుబట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ, సదరు యువకుడి నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ఆ వీడియోలో ఒక వ్యక్తి బైక్ నడుపుతూనే ల్యాప్‌టాప్‌లో పని చేసుకోవడం కనిపిస్తోంది. దీనిపై స్పందించిన సజ్జనార్, "ఏ పనికైనా ఒక పద్ధతి ఉంటుంది. ఇంత ఆత్రుత ఎందుకు? ఆత్రం ఎక్కువైతే ప్రాణాల మీదకు వస్తుంది" అని హెచ్చరించారు. రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు ఏకాగ్రత ఒక్క క్షణం తప్పినా, అది కేవలం సదరు వ్యక్తికే కాకుండా రోడ్డుపై వెళ్లే ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని ఆయన గుర్తుచేశారు. "కడుపు నింపుకోవడానికి చేసే పని, ప్రాణాలను కడతేర్చేలా ఉండకూడదు" అని ఆయన వ్యాఖ్యానించారు. రోడ్లపై ఇలాంటి బాధ్యతారాహిత్యమైన చర్యలకు స్వస్తి పలికి, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని సజ్జనార్ హితవు పలికారు.

# దుబాయ్ నుంచి బంగారం అక్రమ రవాణా

-మొదటిపేజీ



**తరువాయి:** గుజరాత్ అహ్మదాబాద్ లోని అంతర్జా తీయ విమానా శ్రయం అధికారు లు. రట్టు చేశా రు. దుబాయ్ నుంచి అహ్మదాబాద్ వచ్చిన ఇండిగో విమానంలో. కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజినీర్ల సాయంతో నిర్వహించిన ఈ సోదాల్లో..విమానం ముందు భాగంలో ఉన్న టాయిలెట్ లోని స్పీకర్ బాక్స్ లోపల నల్లటి ప్లాస్టిక్ టేపుతో చుట్టిన రెండు పౌచ్ లను స్వాధీనం చేసుకున్నారు. ఆ పౌచ్ లను పరిశీలించగా. అందులో దాచి ఉంచిన.. 24 విదేశీ బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. వీటి బరువు 2 కిలోల 800 గ్రాములు ఉంది. స్థానిక మార్కెట్లో ఈ బంగారం విలువ 4 కోట్ల 26 లక్షల 89 వేలుగా ఉందని అధికారులు తెలిపారు. బంగారాన్ని దాచిన తీరును బట్టి చూస్తే దేశంలోకి అక్రమంగా తరలించే ఉద్దేశంతోనే గుర్తుతెలియని వ్యక్తి దీనిని దాచినట్లు స్పష్టమవుతోంది.

# హైదరాబాద్‌లో అక్రమ నివాసం.. ఏడుగురు విదేశీయులు అరెస్ట్..

-మొదటిపేజీ **తరువాయి:** బంగాదేశ్ నుంచి వచ్చిన అక్రమంగా నగరంలో నివాసం ఉంటున్న ఏడుగురు విదేశీ పౌరులను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం హెచ్‌ఏఎల్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో వీరిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారుబంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఏడుగురు విదేశీయులను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా ఓ అద్దె ఇంట్లో విదేశీయులు నివసిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి పత్రాలను పరిశీలించగా, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా భారత్‌లో నివసించేందుకు అవసరమైన ఇతర అనుమతి పత్రాలు కూడా చూపించలేకపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణలో వీరంతా అక్రమ మార్గంలో భారత్‌లోకి ప్రవేశించి ఇక్కడ నివసిస్తున్నారని పోలీసులు గుర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొంతకాలం గడిపిన అనంతరం హైదరాబాద్‌కు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. వీరు ఏ మార్గం ద్వారా దేశంలోకి ప్రవేశించారు, స్థానికంగా ఎవరి సహకారం పొందారు అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న ఏడుగురిని మెదక్ జిల్లా జోగిపేటలోని విదేశీయుల నిర్బంధ కేంద్రానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్‌కు పంపించేందుకు అవసరమైన న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో కూకట్‌పల్లి జోన్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌ఓటీ) సిబ్బంది జీడిమెట్ల పోలీసులకు సహకరించారు. అక్రమంగా నివాసం ఏర్పాటుకు ఎవరైనా స్థానికంగా సహకరించారా అనే అంశంపై కూడా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణ పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది

# జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం

-మొదటిపేజీ **తరువాయి:** జర్నలిస్టులకు సొసైటీల పేరుతో కాకుండా ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో శనివారం జర్నలిస్టులతో జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ, "జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే సంకల్పంతోనే కేబినెట్ సబ్ కమిటీ వేశాం. మీకు ఎలాంటి సమస్య ఉన్నా మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకురండి. సబ్ కమిటీ ఒకే చోట కూర్చొని సిఫార్సులు తీసుకువస్తే, మీరు టీ తాగే లోపే మినిట్స్ రాసి కేబినెట్‌లో ఆమోదిస్తాం" అని చెప్పారు. వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇచ్చే విధానం వల్ల భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు రాకుండా ఉంటాయని సీఎం వివరించారు. "సొసైటీలపై పిటిషన్ వేయడం సాధ్యమే, కానీ ఒక్కొక్కరి పేరు మీద ఇస్తే ఎవరూ పిటిషన్ వేయలేరు. ఒక్కొక్కరి పేరు మీదే వేయాల్సి వస్తుంది. అది ఆచరణ సాధ్యం కాదు. భవిష్యత్తులో ఈ ఇళ్ల స్థలాలపై ఎలాంటి వివాదాలు రాకూడదన్నదే మా ఉద్దేశం" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ నిర్ణయంతో వారి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# చిన్నాపూర్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

బుగ్గారం మండలంం(తెలంగాణ పత్రిక) జూన్ 13

కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వస్తున్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొన్న ఘటన జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నపూర్ శివారులో శనివారం చోటుచేసుకుంది. ధర్మపురి మండలం నేరెళ్ళకు చెందిన ప్రదీప్ కుమార్ తన కుమార్తె పుష్పలత, మల్లేష్‌తో కలిసి కారులో వస్తుండగా, కొండగట్టు నుండి ధర్మపురి వైపు అతివేగంగా వస్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రదీప్ కుమార్, పుష్పలత, మల్లేష్ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు. అందులో పుష్పలత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే



ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు దోపిడిని నియంత్రించాలి

ముధోల్: 13జూన్(తెలంగాణ పత్రిక)

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడిని ప్రభుత్వం నియంత్రించాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ (ఏఐపీఎస్ యూ) నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలే పరమేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ముధోల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు బడి వద్దు.. ప్రభుత్వ బడి ముద్దు అనే నినాదంతో ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్, పుస్తకాలు, యూనిఫామ్ పేర్లతో మధ్యతరగతి కుటుంబాల





రక్తాన్ని పీడించుకుంటుందని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25% ఉచిత సీట్ల ఎక్కడ కనిపించలేదని విమర్శించారు. పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులను వసూల్ చేస్తూ విద్య చట్టాలను తుంగలో తొక్కుతున్నారని అగ్రహారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేటు విద్య కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పనుల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు మూలిక సదుపాయాలను కల్పించేందుకు ముందడుగు వేయాలన్నారు. ఈ విద్య సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్ల పేరుతో దోపిడీ చేస్తే ఏఐపీఎస్ యూ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐపీఎస్ యూ నాయకులు నితిన్, అఖిలేష్, నిఖిల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# తాస్కానిగూడెంలో వంగిన విద్యుత్ స్తంభం: రైతుల ఆందోళన

చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 13

చండూరు మండల పరిధిలోని తాస్కానిగూడెం గ్రామ పరిధిలో ఓ రైతు పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా వంగిపోవడంతో రైతులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభంపై నుంచి హైటెన్షన్ వైర్లు వెళ్తుండటంతో ఎప్పుడు ఏ క్షణంలో కూలిపోతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పొలాల్లోకి వెళ్తున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫోన్లు చేసి, ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల మండలంలో రెండు విద్యుత్ సంఘటనలు జరిగినా అధికారుల్లో చలనం రాలేదని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి వంగిపోయిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా మార్చిన బీజేపీ



ఇల్లంతకుంట జూన్ 13 తెలంగాణ పత్రిక

ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరిపాలనలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాల మేరకు చేపట్టిన 'స్వచ్ఛ పాఠశాల స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచన మేరకు బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలతో కలిసి తరగతి గదులు, బెంచీలు, కుర్చీలు, వరండా, గ్రౌండ్‌ను శుభ్రం చేశారు. డ్రైనేజీ సమస్యలు తొలగించి, కలుపు మొక్కలు పీకారు. సరస్వతీదేవి విగ్రహాన్ని శుభ్రపరచి పూజలు చేశారు.సోమవారం పాఠశాల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాలను సిద్ధం చేసినట్లు అడిచెర్ల రాజు తెలిపారు. పేద విద్యార్థుల చదువుల కోసం బండి సంజయ్ ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని, గత ఏడాది 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించి, ఉచిత సైకిళ్ల పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా అదే తరహాలో ఫీజులు, సైకిళ్ల అందిస్తామని హామీ ఇచ్చారు.బడికి వెళ్లని పిల్లలను గుర్తించి స్కూల్‌కు పంపేందుకు మండల వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూముల అనిల్ కుమార్, మానకొండూర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి గౌడ్, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం.. ఏర్పాట్లు పూర్తి

-విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు
-ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 13 (తెలంగాణ పత్రిక):



సోమవారం నుంచి ప్రారంభమయ్యే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యా లను శుభ్రపరిచి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందని పేర్కొన్నారు. పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా ఇటీవల నిర్వహించిన "బడిబాట" కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య కోరారు.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 12



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని పెన్షన్ 4000 రూపాయలు ఇవ్వాలని ఎక్స్‌గ్రేషి యో 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచుతానని హామీ ఇచ్చిన మేరకు పది లక్షలకు పెంచాలని చండూరు మండలం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు తాందారి యాదయ్య గౌడ్,కార్యదర్శి మోగుదాల వెంకటేశం గౌడ్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లాలోని నందనం గ్రామంలోని నీరా తాటి ఈత ఉత్పత్తుల కేంద్రానికి తగిన నిధులు కేటాయించాలని పరిశ్రమను ప్రారంభించాలని తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని వారు ఒక ప్రకటనలో కోరారు ప్రతిగీత కార్మికునికి ద్వచక్ర వాహనాన్ని ఇవ్వాలని కోరారు కల్లులోని పోషకాలను ఔషధ గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించి తగు రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు.

# స్టేట్ సిట్రస్ సెమినార్ 2026లో పాల్గొన్న... ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-

రాష్ట్రంలో బత్తాయి సాగు అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు నల్గొండలో నిర్వహించిన స్టేట్ సిట్రస్ సెమినార్--2026 కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో బత్తాయి సాగు ప్రధాన పంటగా మారిందని, వేలాది మంది రైతులు బత్తాయి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అయితే మార్కెట్ ధరల అస్థిరత, పెరుగుతున్న సాగు ఖర్చులు, పురుగుమందులు మరియు ఎరువుల ధరల పెరుగుదల, దిగుబడి నాణ్యత సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. బత్తాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం, ఎగుమతి అవకాశాలను పెంచడం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బత్తాయి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, బత్తాయి రైతులు మరియు వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పేదలకు వరంలా మారాయి

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 13 తెలంగాణ పత్రిక.




రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని శంషాబాద్ రాళ్లగూడ కు చెందిన చీర్ల బాబామ్మా కు సీఎం సహాయ నిధి నుండి శనివారం నాడు రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ 2,50,000/- రెండు లక్షల యాబయ్ వేల రూపాయల చెక్కును అందజేశారు. హాస్పటల్ చికిత్స నిమిత్తం అందించి నట్లు తెలిపారు. సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పేదలకు వరంలా మారాయని తెలిపారు. కార్యక్రమం లో మున్సిపల్ మాజీ వైస్ చెర్మన్ బండి గోపాల్ యాదవ్, దూడల వెంకటేష్ మాజీ నర్సింగ్ మార్కెట్ కమిటీ చెర్మన్, సినీయర్ నాయకులు చెంద్రారెడ్డి, జెట్ట సీదులు,బంటీ సంజయ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# రమేష్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 10వేలు ఆర్థిక సహాయం అందజేత

మాడుగులపల్లి//నల్గొండ//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-



నల్గొండ జిల్లా మాడుగుల పల్లి మండలం పాములపహాడ్ గ్రామనికి చెందిన వల్లవుల రమేష్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం తో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో గ్రామం కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న రెడ్డి కి విషయం తెలియజేశారు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరడంతో వెంటనే ఆర్థిక సహాయంగా 10వేల రూపాయలు ఇవ్వమని చెప్పడంతో శనివారం రోజు పాములపహాడ్ గ్రామ సర్పంచ్ అంజయ్య మరియు కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో యల్లావుల రమేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యు లను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, అనంతరం వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజే శారు. ఉపసర్పంచ్ ఎల్క మాధవరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు గిరి కలిసి మాట్లాడుతూ భవిష్యత్తులో రమేష్ కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటాం అని భరోసా ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రావు వెంకటరెడ్డి , పోలిశెట్టి ఉపేందర్, మామిడి సైదులు, గుండేపురి లక్ష్మినర్సు, వల్కి వెంకన్న, దశరథ, కునుకుంట్ల సతీష్, లచ్చిరెడ్డి, వర్కాల యాదగిరి, గరువయ్య, శోబన్ బాబు, ప్రభాకర్, నవీన్, ఠాగూర్, ధర్మా రెడ్డి, వెంకటా చారి, కార్తిక్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు బిఎల్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు

-కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ రాజ్యసభ సభ్యులు బాడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు, ప్రత్యేకంగా కేక్ కట్ చేసి వారికీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల నుంచి ఎదిగి రాష్ట్ర స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించి, రాజ్యసభ సభ్యుడిగా ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా సమర్థవంతంగా వినిపించిన నాయకుడు బడుగుల లింగయ్య యాదవ్ ని కొనియాడారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జాతీయ స్థాయి రాజకీయ నాయకుడిగా ఎదిగిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. ఇలియాస్ ఖాన్, ఎండి. మగ్దూం భాష, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎం.డి. మాజీద్,దైద సత్యం, పెండ్యాల పద్మ, కోదాటి రమ, గంగుల బిక్షం యాదవ్, మర్రి అంజిబాబు, వడ్డేపల్లి శ్రీనివాస్, ఎండి. షోయబ్ ఖాన్ ,లింగంపల్లి చిరంజీవి, నేరెళ్ల శివ, వల్లంపట్ల వినోద్ కుమార్, ఎలుగుబెల్లి నాగరాజు, యాదగిరి, బిక్కన్, దోనేటి సైదులు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, గణేష్, షేక్ మస్తాన్, ఆయిల్ శ్రీనివాస్, పందిరి వేణు, నగ్రా ముకేష్ చౌదరి, ఎం.డి, గయాస్, రామావత్ వినోద్ నాయక్, కోల నాగరాజు, గౌటె కనకయ్య ,బంటు దుర్గయ్య, షేక్ ఫయాజ్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొనరు.

# ధర్మపురి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ అశోక్ కుమార్

ధర్మపురి మండలం (తెలంగాణ పత్రిక) జూన్ 13



జగిత్యాల జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను,పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు. కమ్యూనిటీ పోలీసులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ షాపుల ద్వారా 14రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలి

-ఐద్వా మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షురాలు కౌసల్య డిమాండ్

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-



రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను పంపిణీ చేయాలని ఐద్వా మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షురాలు కౌసల్య డిమాండ్ చేశారు. వన్ టౌన్ 15వ వార్డులో ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహిఒచారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఒకవైపు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలతో పాటు కూరగాయలు పప్పు ధాన్యాలు వంటనూనె లాంటి అనేక నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలను ముఖ్యంగా మహిళలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తూ రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం మాత్రమే కాకుండా 14రకాల నిత్య జీవితానికి అవసరమైన ఇతర నిత్యవసర వస్తువులను కూడా రేషన్ ద్వారా అందిస్తే సామాన్యుల ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుందని అన్నారు. వెంటనే ప్రభుత్వం 14 రకాల వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని పేదలపై పెరిగిన ధరల భారాన్ని తగ్గించాలని నిత్యం పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బ్రతకడమే కష్టంగా మారిన తరుణం లో ప్రభుత్వం కేవలం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకోకుండా, గతంలో లాగే నిత్యవసర వస్తువులన్నింటినీ రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా లేదా రాయితీ ధరలపై అందించాలని. అర్హులైన పేదలందరికీ తక్షణమే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన సరుకులను, సరైన కొలతలతో పంపిణీ చేయాలని సామాన్యుడి సంక్షేమమే ధ్యేయంగా రేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన 2500 రూపాయలు హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వం మాత్రం మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయల హామీని విస్మరిస్తుందని వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి ప్రభుత్వం ఇస్తానన్న 12 వేల రూపాయల హామీని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించినప్పటికైనా వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, జ్యోతి, ప్రవలిక, నాగలక్ష్మి, జీవితం ప్రియాంక, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం.. దుండగులపై చర్యలకు

**-వెల్దుర్తి ఎస్ఐ రాజు హామీ**

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 13 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండలం శేరిలా గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై అంబేద్కర్ సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం ఉదయం విగ్రహం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజు తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



పై అధికారుల ఆదేశాల మేరకు విగ్రహం దెబ్బతిన్న చూపుడు వేలుకు మరమ్మతులు చేపట్టించి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ కూడా ఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత, దేశ ప్రజలందరికీ ఆదర్శప్రాయమైన మహనీయుడు. ఆయన ఏ ఒక్క వర్గానికే చెందిన వ్యక్తి కాదు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమైన విషయం" అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# నేలవంచ గ్రామాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయ చంద్ర






**-ఖేత్ బచావో అభియాన్**
**-వరి కొయ్యలు కాల్చడం నిషేధించాలి**
**-నానో యూరియా వలన లాభాలు**
**-నకిలీ విత్తనాలు అమ్మకాలు పై అప్రమత్తంగా ఉండాలి**

గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 13. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని నేలవంచ గ్రామాన్ని సందర్శించిన, జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయచంద్ర మాట్లాడుతూ... లైసెన్స్ కలిగినా డీలర్స్ వద్దనే విత్తనాలు కొనాలి, బిల్లు భద్రత గా ఉంచుకోవాలని, ఒకే భూమిలో ప్రతి సీజన్‌లో వేర్వేరు పంటలను మారుస్తూ సాగు చేయడం. దీనివల్ల రైతులకు అలాగే నేల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అన్నారు. పంట మార్పిడి వల్ల ఉపయోగాలు నేల సారవంతం పెరుగుతుందని, వేర్వేరు పంటలు నేలలోని పోషకాలను భిన్నంగా వినియోగిస్తాయని, దీంతో నేల పోషక సమతుల్యత కాపాడ బడుతుందని, పురుగులు అలాగే వ్యాధులు తగ్గుతాయని, ఒకే పంటను పదేపదే వేస్తే కొన్ని పురుగులు, వ్యాధులు ఎక్కువ అవుతాయని, పంట మార్పిడి వల్ల వాటి జీవచక్రం భంగం చెందుతుందని, ఎరువుల ఖర్చు తగ్గుతుందని, పప్పుధాన్య పంటలు నత్రజని (నైట్రోజన్)ను నేలలో పెంచుతాయని, దీంతో రసాయన ఎరువుల అవసరం తగ్గుతుందని, కలుపు మొక్కలు నియంత్రణలో ఉంటాయని, వేర్వేరు పంటల సాగు విధానాల వల్ల కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుందని, ఉత్పత్తి ఎక్కువగా వస్తుందని, నేల ఆరోగ్యం మెరుగుపడటం వల్ల పంట దిగుబడి పెరుగుతుందని, నీటి వినియోగం సమర్థవంతంగా ఉంటుందని, ప్రతి పంటకు నీటి అవసరం వేర్వేరుగా ఉండటంతో నీటి వనరులను సమతుల్యంగా ఉపయోగించవచ్చని, రైతుకు ఆర్థిక భద్రత కలుగుతుందని, ఒక పంట నష్టపోయినా, ఇతర పంటల ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని, ఉదాహరణకు: వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా మొక్కజొన్న సాగు చేయడం మంచి పంట మార్పిడి విధానం అని ఆయన తెలిపారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి, నేల నాణ్యతకు గణనీయమైన అనర్థాలు కలుగుతాయని, ముఖ్యంగా ఇవి గమనించాలని, గాలి కాలుష్యం వరి కొయ్యలు కాల్చినప్పుడు పెద్ద మొత్తంలో పొగ, కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, స్మాగ్ వంటి హానికర వాయువులు విడుదల అవుతాయని, ఇవి శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా, అలర్జీలు పెంచుతాయని, నేల నాణ్యత తగ్గిపోవడం, కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని, నేలలోని సేంద్రియ పదార్థం తగ్గి, పంటల దిగుబడి మీద ప్రభావం పడుతుందని, అగ్ని ప్రమాదం నియంత్రణ లేకుండా కాల్చితే, పొలాల నుంచి పక్కనున్న ప్రాంతాలకు మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని, వాతావరణ మార్పు ప్రభావం కార్బన్ వాయువులు పెరగడం వల్ల, గ్లోబల్ వార్మింగ్ వేగవంతం అవుతుందని, పొలాల్లో మిగిలే కాలిన అవశేషాలు పశువులు తింటే వాటి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చని ఆయన సూచించారు. ప్రత్యామ్నాయాలు: కొయ్యలను నేలలో కలపడం, పశువులకు ఆహారంగా ఉపయోగించడం, బయోగ్యాస్ తయారీకి ఉపయోగించడం, మీరు కావాలంటే, వరి కొయ్యలను ఉపయోగించి రైతులు లాభం పొందే మంచి పద్ధతులు కూడా వివరంగా వివరించారు. నానో యూరియా రైతులు యూరియా వాడకం తగ్గించి, నానో యూరియా వాడకం పెంచాలి అని, జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయచంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లో రాజు సాంకేతిక వ్యవసాయ అధికారి, గ్రామ రైతులు, ఏఈఓ, తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ 2.0 అండర్ డ్రైనేజ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

**-నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు కాంట్రాక్టర్లకు ఆదేశించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్**
**-పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే**
**-ప్రజలకు తాగునీరు, మురుగునీటి సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం.**

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-

ఈరోజు మిర్యాలగూడ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరియు తాగునీటి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకర్ల నిర్మాణ పనులను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు కాంట్రాక్టర్లతో కలిసి ఆయన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మొదటగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగునీటి పైపులు వేసేటప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్లను తవ్విన తర్వాత





తిరిగి వాటిని త్వరగా బాగు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత, పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం కొత్తగా నిర్మిస్తున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల పనులను ఆయన దగ్గరుండి చూశారు..సిమెంట్, ఇనుము నాణ్యతను పరిశీలించి, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మన ప్రభుత్వ ముఖ్య ఆశయం. అమృత్ 2.0 పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులతో మురుగునీటి వ్యవస్థను, తాగునీటి సరఫరాను ఆధునీకరిస్తున్నాము. రాబోయే కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకే ఈ భారీ వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ల పనులు చేపడుతున్నాము..ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ కలిగి ఉండాలి

**- నర్కుడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్.**

రాజేంద్రనగర్ ప్రతినిధి, జూన్ 13 తెలంగాణ పత్రిక.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచి శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష క్యాంపు నిర్వహించారు. ఈ ఐ క్యాంపులో గ్రామ ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేసుకున్నారు.వారికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికి మందులతో పాటు కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని తెలిపారు. ఆరోగ్య సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే దానిని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని కలిగి ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్కుడ మాజీ ఎంపీటీసీ తొంట అశోక్ వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# శంషాబాద్లో దంచి కట్టిన వానలు




రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 13 తెలంగాణ పత్రిక.

శుక్రవారం నాడు రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో అక్కడక్కడ చెట్లు కొమ్మలు విరిగిపడి కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.శనివారం నాడు వానలు దంచి కొట్టడంతో శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

# నీలోజిపల్లి, వల్లంపట్ల గ్రామాల్లో "మనబడి

**-మన బాధ్యత" కార్యక్రమం విజయవంతం**





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 13, తెలంగాణ పత్రిక

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమాల్లో భాగంగా, కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో "మనబడి -- మన బాధ్యత" కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం, పాఠశాలల పట్ల ప్రజల్లో బాధ్యత భావన పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అలాగే వల్లంపట్ల గ్రామంలో కూడా ఇదే కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేశారు. గ్రామ ప్రజలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి సహకరించారు.నీలోజిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆవుల లక్ష్మారెడ్డి, కదిరే నాగరాజు, ఎర్ర అశోక్, అనుముల నరసయ్య, ఎర్ర బాల్‌రెడ్డి, ఎర్ర మధుకర్ తదితరులు పాల్గొన్నారు.గ్రామాల్లో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం




సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 13, తెలంగాణ పత్రిక



జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయుష్ ఆరోగ్య మందిరి యునాని డిస్పెన్సరీలో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ నస్రిన్ మేడం ఆధ్వర్యంలో మహిళలు మరియు సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేశారు. యోగా శిక్షకులు బి. శ్రీనివాస్ మరియు టి. స్వప్న యోగా ఆసనాలు, ప్రాణాయామ విధానాలను నేర్పిస్తూ వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.అలాగే ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి సమతుల్య ఆహారం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, రోజువారీ ఆహారంలో కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు, పాలు తదితర పోషకాహార పదార్థాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. యోగా, వ్యాయామం మరియు సరైన ఆహారపు అలవాట్ల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో డీపీఎం తిరుపతి , ఫార్మసిస్ట్ శ్రీనివాస్ , ఆశా వర్కర్లు, మహిళలు, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొని యోగా శిక్షణను అభ్యసించారు.

# రక్త దానం మహాదానం

-లెక్చరర్ ఉమాశేషారావుదవైద్య




కామారెడ్డి, జూన్ 13,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




ప్రతి సంవత్సరం జూన్ 14 రోజున ప్రపంచ రక్త దాతల దినోత్సవం జరుపుకుంటారు. రక్తంయొక్క ప్రాముఖ్యం తెలియడం ర క్త కొరత సమస్యలపైఅవ గాహన కల్పించడం ఈ దినత్సవాన్ని ప్రపంచఆరో గ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. రక్తదానం ద్వారా మన ఇతరుల కు సాయం చేస్తాం ఇదిమాన వత్వాన్ని పెంచే గొప్ప ఎ లాంటి లాభం ఆశించకుం డా చేసే సేవ ఇతరులు కూడా రక్తదానం చేయడా నికి ప్రేరణగా నిలుస్తుంది. రక్తదానం వల్ల దాతకు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి శారీరంలో కొత్త రక్త కణాలు తయారు కి సహాయపడుతుంది ఆరోగ్యాన్నిపర్యవేక్షించుకునే అవకాశం హిమోగ్లోబిన్ బిపి వంటి పరీక్షల ద్వారా లభిస్తుందిరక్తదానం ఒక అత్యంత గొప్ప సేవ. ఇది మనుషుల ప్రాణాలు రక్షించే మహత్తర దానం దీని ప్రాధాన్యత ఇలా ఉంటుంది,ప్రమాదాలు శాస్త్ర చికిత్సలు, ప్రసవ సమయంలో రక్తం అవసరం అవుతుంది,ఒకేసారి రక్తదానం చేస్తే ఇద్దరు ముగ్గురు ప్రాణాలు కాపడవచ్చురక్త దానం చేసే విధానం,ఎవరు రక్త దానం చేసే విధానం,రక్త దానం చేయడం సులభం, సురక్షితం అప్పుడు దశల వారి గా విధానం యోగ్యత లు చూద్దాం నమోదు రక్త దాన శిబిరం లేదా ఆసుపత్రి లో మీ వివరాలు నమోదు చేస్తారు. బి.పి,హిమోగ్లోబిన్,బరువు పరీక్షలు చేస్తారుమీరు రక్తదానం చేయడానికి సరిపోతారా అనినిర్ణయిస్తారు, సుమారు 350 నుంచి 450 మి ల్లి లీటర్ల రక్తాన్ని తీసుకుం టారురక్తదానం తర్వాత 10 నుండి 15 నిమిషాలు విశ్రాంతితీసుకోవాలిజ్యూ స్ లేదా తేలికపాటి ఆహా రం ఇస్తారు. వయస్సు 18 నుంచి65సంత్సరాలు, బరువుకనీసం50కిలోలు, ఆరోగ్యంబాగుండాలి, హిమో గ్లోబిన్ తగినంత స్థాయిలోఉండాలిరక్తదానం చేయకూడని వారు. జ్వరం, జలుబు, ఇన్ఫెక్షన్లు ఉన్నవారు, కొన్ని దీర్ఘకా లిక వ్యాధులు ఉన్నవా రు,రక్తదానం చేసే ముందు తేలికపాటి ఆహారం తీసుకోవాలి, నీరు బాగా తాగాలి, నిద్రఉండాలికొన్ని గంటలు బరువైన పనులుచేయకండి, ఎక్కువ ద్రవాలు తాగండి,రక్త దానం చేయడం చాలా సురక్షితం మరియు సుల భంఇదిఒకరిప్రాణాన్నికాపడే మహత్తర సేవ. ఈ రోజు మీరు ఇచ్చే రక్తం రేపు ఎవరో ప్రాణాలు కాపడవచ్చు.

## పోతంగల్ లో యోగా కార్యక్రమాలు

-గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆయుష్ డిపార్ట్మెంట్స్ ఆధ్వర్యంలో



తెలంగాణ పత్రిక జూన్ 13

పోతంగల్ మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ యోగ డే కార్యక్రమంలో భాగంగా ఈనెల 12 నుండి 21 వరకు జరిగే యోగ కార్యక్రమాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ నందు నిర్వహించడం జరుగుతుందనీ పోతంగల్ గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవలని యోగ ఇన్స్పెక్టర్ సతీష్ గౌడ్ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మన ఆరోగ్యం మన అరచేతిలో ఉండేటట్టు కాపాడుకోవాలన్నారు. నిత్యజీవితంలో యోగాన్ని మనం చేసే పనిలో ఒక భాగంగా చేసుకుంటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. యోగాకు ఒక సమయం కేటాయించి ఈ ఆధునిక యుగంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ,ఆసనాలు, ధ్యానం, పిల్లల్లో ఎదుగుదలకు ఆసనాలు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ద్వారా పొతంగల్ గ్రామానికి ఉచిత యోగాన్ని కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఒక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందనీ గ్రామ ప్రజలకు తెలిపారు. ఆయుష్మాన్ ద్వారా చేపట్టే యోగా కార్యక్రమాలను మండల కేంద్రంలోని ప్రజలు చుట్టుపక్క గ్రామాల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ ఇన్స్పెక్టర్ డి సతీష్ గౌడ్ జ్యోతి, ఆశ వర్కర్లు శారద, సునీత తదితరులు పాల్గొన్నారు.

# మీనాక్షి నటరాజన్‌పై కేసు, నామినేషన్ తిరస్కరణ శోచనీయం: ఐఎన్‌టీయూసీ నేత కెందాల ప్రశాంత్ తీవ్ర ఆగ్రహం

-కాంగ్రెస్ విలువల గల నాయకురాలికి అన్యాయం జరగడం సరికాదు
-రాహుల్ గాంధీ గారు తక్షణమే జోక్యం చేసుకోవాలి
-కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదు: ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ హెచ్చరిక

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 13 తెలంగాణ పత్రిక.





కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంచార్జ్, సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ పై తెలంగాణలో కేసు నమోదు కావడం, ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం తీవ్ర శోచనీయమని ఐఎన్‌టీయూసీ (×చీఖజ) తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కెందాల ప్రశాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, పార్టీ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే ఒక నిబద్ధత గల నాయకురాలిపై ఇలాంటి చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజల మనోభావాలు తెలిసిన నాయకురాలు శ్రీమతి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీ విలువలను నమ్ముకుని, ప్రజల ఆర్థిక ఇబ్బందులు, వారి మనోభావాలపై పూర్తి అవగాహనతో పనిచేసే నాయకురాలని ప్రశాంత్ కొనియాడారు. అలాంటి అంకితభావం ఉన్న నాయకురాలి నామినేషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం వెనుక ఉన్న కుట్రలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ''ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుండి వచ్చిన మీనాక్షి నటరాజన్ కి ఇలాంటి అన్యాయం జరిగితే, క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి కార్యకర్త మనోస్థైర్యం దెబ్బతింటుందన్నారు . ఒక కార్యకర్త కష్టం తెలిసిన నాయకుడిగా రాహుల్ గాంధీ ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని అధిష్ఠానం స్పందించాలన్నారు. ఈ అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీవ్రంగా ఆలోచించాలని, పార్టీ కోసం రక్తం చెమటోడ్చే ప్రతి కార్యకర్త దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని ప్రశాంత్ హెచ్చరించారు. మీనాక్షి నటరాజన్ కి న్యాయం జరిగేంత వరకు తాము అండగా ఉంటామని, ఈ విషయంలో రాహుల్ గాంధీ స్వయంగా స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఐఎన్‌టీయూసీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలు

-పట్టించుకోని అధికారులు
-ఏ ఐ ఎఫ్ డి ఎస్రాష్ట్రకార్యదర్శి జబ్బార్

కామారెడ్డి, జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం ప్రారంభమైందో లేదో. ప్రైవేట్ విద్యా సంస్థల ఆక్రమ దందా మళ్లీ మొదలైందిని అఖిల భారత ప్రధాతంత్ర విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి జబ్బార్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వాన్నిబంధనలు విద్యాశాఖ ఆదేశాలను తుంగలో తొక్కుతూ కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రుల జేబులోకి చిల్లులు పెడుతూ కనీస వసతులు కూడా కల్పించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి నిబంధనలను పర్యవేక్షణ విద్య శాఖ అధికారులు మాత్రం మామూలుగా వ్యవహరిస్తూ చూసి చూడనట్లు నటిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. చాలా ప్రైవేట్ పాఠశాలలు ఇరుగైన గదులలో ఎలాంటి వెంటిలేషన్ లేని అపార్ట్మెంట్లో నడుస్తున్నాయని ప్రభుత్వం నిబంధన ప్రకారం ఉండాల్సిన ఆటస్థలాలు అలంకరణ ప్రయంగా కూడా లేవు అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రాణాలు కాపాడుకోవడానికి ఫైర్సెఫ్టీ అగ్నిమాపాకు రక్షణ అనుమతులు లేవు ఇక విద్యార్థి సంస్థలు తీసుకెళ్లే స్కూలు బస్సుల పరిస్థితి మరి ఘోరం ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని బస్సులను అనుభవం లేని డ్రైవర్లతో నడుపుతూ ప్రమాదాలు గురవుతున్నాయని అన్నారు అలాగే విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు స్టేషనరీ అమ్మి విద్యను వ్యాపారికరంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే నిబంధన పాటించని సమస్యలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేసి విద్యార్థులకు న్యాయం చేసేలా ఉద్యమాలు చేస్తామని అధికారులకు హెచ్చరించారు.

# ప్రవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి

-బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్

కామారెడ్డి, జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డి జిల్లా కేంద్రం బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పెంచుతున్న ఫీజులు అరికట్టాలి, తెలంగాణ రాష్ట్రంలో రైట్ టు ఎడ్యుకేషన్ విద్యా హక్కు చట్టాన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ఫీజులు, బుక్స్, నోట్స్, యూనిఫామ్లు షూస్, టై, బెల్ట్ లు ఇలా ప్రతి ఒక్కటి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర్నుంచి కొనాలని, సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై మరింత భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ప్రైవేట్ పాఠశాలల ఫీజులు నియంత్రణ కు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అధిక బరువు ఉన్న పుస్తకాల భారాన్నికూడా తగ్గించే చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రవేట్ స్కూల్లో ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల పిల్లలకు 20% ఉచితంగా విద్యను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారు అమలుపరచకపోవడం తనే విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు తో ఒక కమిటీని వేసి ఫీజు నియంత్రణ చేయకపోవడం సిగ్గుచేటు మీరు వెంటనే రైట్ టు ఎడ్యుకేషన్ హక్కు చట్టాన్ని వెంటనే అమలుపరిచి ప్రైవేట్ స్కూల్లో చదివే పిల్లలకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పిల్లల ఫీజుల నియంత్రణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రైవేటు స్కూళ్లకు ఒకే ధరల పట్టిక అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఫీజు విధానాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకొని విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని, బహుజన్ సమాజ్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్నవారు జిల్లా ఉపాధ్యక్షులు కోకొండ రాజేందర్, కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ ఈసిరికాయల సాయిలు, కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు నత్తి జీవన్, ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు మరలు సాయిబాబా, ఎల్లారెడ్డి అసెంబ్లీ ఉపాధ్యక్షులు కుసుల కంటి సాయిలు, కామారెడ్డి అసెంబ్లీ కోశాధికారి బానోత్ పిర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలపై సీపీఎం నాయకుల ఆందోళన

-వైద్య సదుపాయాల కల్పన, డాక్టర్ల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్

మేడ్చల్ జూన్ 13(తెలంగాణ పత్రిక):-



మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిని సీపీఎం నాయకులు శనివారం సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ. అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్లే రోగుల సంఖ్య తగ్గుతోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అవసరమైన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన వైద్యుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల వైద్య సేవలు దెబ్బతింటున్నాయని, ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో భయాందోళనలు నెలకొనే పరిస్థితిని ప్రభుత్వం సృష్టిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. సీపీఎం మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల నూతన భవన పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పనులు ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఆస్పత్రిలో పోస్టుమార్టం సదుపాయం లేకపోవడంతో ప్రజలు గాంధీ ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అవసరమైన అన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలహీనపర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తగిన నిధులు, పరికరాలు, సిబ్బందిని అందించకుండా నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ మండల నాయకులు రమేష్, నర్సింగ్‌రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ లో గట్లమల్యాల విద్యార్థిని ప్రతిభ

**-ఓబీసీ కేటగిరీలో అఖిల భారత స్థాయిలో 263వ ర్యాంకు**
**-ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ సీటు కైవసం...!**

**నంగునూరు, జూన్ 13(తెలంగాణ పత్రిక):**

జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామ విద్యార్థిని మోర వర్ష అద్భుత ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలైన జోసా మొదటి విడత సీట్ల కేటాయింపులో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్(సీఎస్ఈ) సీటును సాధించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అఖిల భారత స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 263వ ర్యాంకు సాధించింది. జనరల్ కేటగిరీలో 1544వ ర్యాంక్ పొందింది. దీంతో బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించి ప్రసంశలు అందుకున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ తో పాటు ఇటీవల విడుదలైన వివిధ పోటీ పరీక్షల్లోనూ ర్యాంకులతో మోర వర్ష ప్రతిభ కనబరచడం విశేషం. జేఈఈ మెయిన్స్-2026 పరీక్షలో 99.92 పర్సంటైల్ సాధించింది. దీంతో అఖిల భారత స్థాయిలో జనరల్ కేటగిరీలో 1362వ ర్యాంక్ పొందిందింది. ఓబీసీ కేటగిరీలో 235వ ర్యాంక్ సొంతం చేసుకుంది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ కోర్సుల కోసం నిర్వహించే ఎప్‌సెట్ -2026 పరీక్షలోనూ స్టేట్ రాష్ట్ర స్థాయిలో 148వ ర్యాంక్ సాధించి తన అసాధారణ ప్రతిభను చాటుకుంది. ఎప్‌సెట్ లో నార్మలైజేషన్ తర్వాత





గణితంలో 49.30 మార్కులు, భౌతిక శాస్త్రంలో 31.31 మార్కులు, రసాయన శాస్త్రంలో 34.30 మార్కులు కలిపి మొత్తం 114.92 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 148వ ర్యాంక్ పొందడం విశేషం.మోర వర్ష పోటీ పరీక్షలతో పాటు అకడమిక్ పరీక్షల్లోనూ అసాధారణ ప్రతిభ కనబర్చి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఇంటర్మీడియట్ పరీక్షలో 985 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు పొందింది. పదో తరగతిలోనూ 10 జీపీఏ సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచింది. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించిన మోర వర్ష స్వగ్రామం సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల. తల్లిదండ్రులు బింగి కవిత, మోర గణేష్ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో వృత్తి రీత్యా ప్రస్తుతం వీరు సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. తండ్రి మోర గణేశ్ సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డి పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి బింగి కవిత నంగునూరు మండలం కేంద్రం బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. వర్ష పెద్ద నాన్న మోర మోహన్ జీవ శాస్త్రం ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఇంట్లో ఉన్న విద్యా వాతావరణం, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహంతో వర్ష చదువులో ముందంజలో ఉంది. దీనికి తోడు పట్టుదల, క్రమ శిక్షణతో చదవడం వల్ల వర్ష ప్రతి పరీక్షలోనూ విజయం సాధించింది. దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థ అయిన బాంబే ఐఐటీలో, అదీ ఎంతో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ బ్రాంచిలో సీటు సాధించడంతో పలువురు ప్రశంసిస్తున్నారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచిన వర్ష తో పాటు, తల్లిదండ్రులు బింగి కవిత, మోర గణేశ్ లను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు అభినందించారు.

## ఆత్మగౌరవ గర్జనగా తెలంగాణ భాష.. అక్షర పోరాటానికి ప్రతీకగా సాంస్కృతిక ఉద్యమం

**-భాష అంటే మాట కాదు.. తెలంగాణకు అది బతుకు, అస్తిత్వం:**
**-సామాజిక సాంస్కృతిక రాజకీయ విశ్లేషకులు సామ్రాట్ సంజీవన్**

**కొత్తగూడెం , జూన్ 13 (తెలంగాణ పత్రిక)**

తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై జరిగిన వివక్షకు వ్యతిరేకంగా అక్షర పోరాటం కొనసాగాల్సిన అవసరం ఉందని సామాజిక సాంస్కృతిక రాజకీయ విశ్లేషకులు సామ్రాట్ సంజీవన్ పేర్కొన్నారు. తెలంగాణ భాష అనేది కేవలం మాట్లాడే విధానం కాదని, అది ప్రజల జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ భాషపై చారిత్రకంగా చిన్నచూపు చూశారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ యాసను "పల్లెటూరి భాష", "కరుకు యాస" అంటూ అవమానించారని, కానీ ఈ భాషలోనే శతాబ్దాల చరిత్ర, ప్రజల జీవన అనుభవాలు, సంస్కృతి దాగి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ భాషలో ఉర్దూ, మరాఠీ, కన్నడ తదితర భాషల ప్రభావం ఉండటం దాని బలమని, డెక్కన్ ప్రాంతంలోని భిన్న సంస్కృతుల కలయికకు ఇది నిదర్శనమని అన్నారు. గోల్కొండ నుంచి నిజాం పాలన వరకు ఈ ప్రాంత చరిత్రకు భాష ప్రతిబింబంగా నిలిచిందన్నారు. సాహిత్యంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం పాల్కురికి సోమనాథుడు, పోతన వంటి కవుల రచనల్లో కనిపించే సహజత్వం తెలంగాణ సాహిత్య సంపదకు నిదర్శనమని పేర్కొన్నారు. అయితే చాలాకాలం పాటు తెలంగాణ యాసను సినిమాలు, మీడియా రంగాల్లో సరైన గౌరవంతో చూపించలేదని విమర్శించారు. జానపద కళలు, ఒగ్గుకథలు, చిందు భాగోతాలు, డప్పు సంస్కృతి వంటి ప్రజా కళారూపాలను అణగదొక్కారని, కానీ



తెలంగాణ ఉద్యమ కాలంలో పాటలు, సాహిత్యం ప్రజల్లో చైతన్యం నింపాయని తెలిపారు. దళిత బహుజనుల పాత్ర కీలకం తెలంగాణ ఉద్యమ చరిత్రలో దళిత బహుజనుల పాత్ర కీలకమని సామ్రాట్ సంజీవన్ అన్నారు. నిజాం కాలం నాటి దొర-పటేల్-పట్వారీ వ్యవస్థలో ఎక్కువగా అణచివేతకు గురైన వర్గాలు దళితులేనని పేర్కొన్నారు.ందభూమి, విద్య, గౌరవం కోసం దళితులు చేసిన పోరాటాలు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం మరింత కృషి అవసరమని అన్నారు. ఖమ్మం యాసకు ప్రత్యేక గుర్తింపు తెలంగాణలో ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన యాస ఉందని, ఉమ్మడి ఖమ్మం ప్రాంత భాషలో కోస్తా ప్రభావంతో పాటు తెలంగాణ ప్రత్యేకత కనిపిస్తుందని వివరించారు. "ఏమైతదది", "ఎక్కడికి పోతాండవు" వంటి పలుకుబడులు ప్రాంతీయ భాషా వైవిధ్యానికి నిదర్శనమన్నారు. భాషను కాపాడుకోవడం అంటే సంస్కృతిని కాపాడుకోవడం తెలంగాణ భాష, సాహిత్యం, జానపద కళలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సామ్రాట్ సంజీవన్ అన్నారు. భాషను కోల్పోతే చరిత్ర, సంస్కృతిని కోల్పోయినట్టేనని పేర్కొన్నారు. "మా మాట, మా పాట, మా సంస్కృతి మా ఆత్మగౌరవం" అనే భావనతో తెలంగాణ అక్షర పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

జై భీమ్.. జై తెలంగాణ

# కామారెడ్డిలో త్వరలో ఏఐజేపీఎఫ్ నూతన కమిటీ ఆవిర్భావం

**-జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంక్షేమం, రక్షణే ధ్యేయం**

**కామారెడ్డి ,జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

సత్యం పలికే కలాన్ని ఎవరూ బంధించలేరు.ధర్మం కోసం నిలిచే గొంతును ఎవరూ అణగదొక్కలేరు" అనే మహోన్నత భావనతో జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంక్షేమం, రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్న అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ త్వరలో కామారెడ్డి జిల్లాలో నూతన కమిటీని ఆవిష్కరించనుంది. ఏఐజేపీఎఫ్ జాతీయ చైర్మన్ చుంచు కుమార్ నాయకత్వంలోరాష్ట్ర గౌరవ సలహాదారులు శ్రీనివాస్, డాక్టర్ సి.ఎం. కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు పరకాల సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంస్థ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తోందని నాయకులు పేర్కొన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి కలానికి ఉందని, స్వాతంత్ర్య సమర కాలంలో పత్రికలు, రచయితలు, జర్నలిస్టులు ప్రజల్లో చైతన్యం నింపి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని రగిలించారని వారు గుర్తు చేశారు. చరిత్రలో ఎన్నో సామాజిక ఉద్యమాలకు, స్వేచ్ఛా పోరాటాలకు జర్నలిజమే వెన్నెముకగా నిలిచిందన్నారు. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు "నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అనే వాక్యం నేటికీ సామాజిక వాస్తవాలను ప్రతిబింబిస్తోందని, అన్యాయాన్ని ప్రశ్నించడం జర్నలిస్టు ధర్మమని పేర్కొన్నారు. అలాగే వేమన చెప్పిన. "నిజమాడిన వాని నిందింతురు లోకులు" అనే సూక్తి జర్నలిస్టుల జీవితానికి అద్దం పడుతుందని, సత్యాన్ని వెలుగులోకి తెచ్చే వారే ఎన్నో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా అన్యాయం జరిగినా, అక్రమ కేసులు బనాయించినా, విధి నిర్వహణలో ఆటంకాలు కలిగించినా, వారి పక్షాన నిలబడి చట్టపరంగా మరియు నైతికంగా అండగా ఉండటం ఏఐజేపీఎఫ్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటివరకు అనేక మంది జర్నలిస్టులు ఎదుర్కొన్న ఇబ్బందుల సమయంలో సంస్థ ముందుండి సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ సరిహద్దుల్లో సైనికులు దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు ప్రజల హక్కులు, ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై నిఘా కాస్తూ సమాజానికి కాపలాదారులుగా ఉంటారని పేర్కొన్నారు. అలాంటి జర్నలిస్టుల రక్షణ కోసం ఏఐజేపీఎఫ్ ఒక రక్షణ కవచంలా పనిచేస్తోందన్నారు. "సత్యం -- ధర్మం -- న్యాయం" అనే మూడు మూల సూత్రాలనే సంస్థ తన కార్యాచరణకు పునాదిగా ఎంచుకుందని, ఈ మార్గంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయబోమని చైర్మన్ చుంచు కుమార్ స్పష్టం చేసినట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో నూతన కమిటీ ఏర్పాటు జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు మరింత బలం చేకూర్చే శుభపరిణామమని నాయకులు అభిప్రాయపడ్డారు. జిల్లాలోని జర్నలిస్టులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచి, సత్యం కోసం పోరాడే కలాలకు రక్షణగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, జర్నలిస్టుల గౌరవం మరియు హక్కుల పరిరక్షణలో ఎప్పటికీ ముందువరుసలో ఉంటామని ఏఐజేపీఎఫ్ నాయకత్వం పునరుద్ఘాటించింది. సత్యం కోసం కలం ధర్మం కోసం పోరాటం.జర్నలిస్టుల రక్షణే మా ధ్యేయంఅని ఏఐజేపీఎఫ్ నాయకులు పేర్కొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా

**-దేవోల్లా రాములు**

**కామారెడ్డి ,జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

హ్యూమన్ రైట్స్ యాంటీ కార్పొరేషన్ అసోసియేషన్‌కామారెడ్డి జిల్లా చైర్మన్‌గా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ కు చెందిన దేవోల్లా రాములు ఎన్నికయ్యారు. ఇట్టి కార్యవర్గ సమావేశం సికింద్రాబాద్ అమృతవాణి నిలయంలో ఏర్పాటు చేశారు.ఈ మేరకు దేవోల్లా రాములు కు నియమాకపత్రాన్ని హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫౌండర్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డైరెక్టర్ రవికుమార్ లీగల్ వింగ్ చైర్మన్ ఊర్మిళ రాణి పాత్రో మరియు స్టేట్ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ మంజుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగాదేవోల్లా రాములు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.మానవ హక్కులు (హ్యూమన్ రైట్స్) అంటే మనిషిగా జన్మించిన ప్రతి ఒక్కరికీ, ఎలాంటి వివక్ష లేకుండా (కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా) సంక్రమించే ప్రాథమిక హక్కులు మరియు స్వేచ్ఛ. ఇవి ప్రతి మనిషి గౌరవంగా జీవించడానికి అవసరమైన న్యాయం మరియు సమానత్వాన్ని అందిస్తాయని తెలిపారు.

## పూసల సామాజిక వర్గాన్ని సంచార జాబితాలో చేర్చడం పట్ల హర్షం

**నంగునూరు, జూన్ 13(తెలంగాణ పత్రిక):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటకు కట్టుబడి పూసల సామాజిక వర్గాన్ని సంచార జాతుల జాబితాలో చేరుస్తూ జీవో నెంబర్ 10 జారీ చేయడం పట్ల సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పూసల సంఘం నాయకుడు గుంటుపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో గుంటుపల్లి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి పూసల సామాజిక వర్గాన్ని సంచార జాతుల జాబితాలో చేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఇతర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పూసల సామాజిక వర్గ అభివృద్ధికి నిధులను కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సీనియర్ నేత షబ్బీర్ అలీకి పిసిసి షోకాజ్ నోటీసులు

**-కామారెడ్డి లో కలకలం రేపు తుంది**

**కామారెడ్డి , జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**



కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించారనే ఆరోపణలపై సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీకి టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు పార్టీ చీఫ్ బొమ్మ మహేష్కుమార్ గౌడ్ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల షబ్బీర్ అలీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ఓ మహిళా నాయకురాలిని ఉద్దేశించి చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలోనే ఆయనకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కొన్ని రోజులుగా సదరు సీనియర్నేత చేసిన వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ముఖ్యంగా మహిళా నేత పట్ల ఆయన వ్యవహరించిన తీరు, మాట్లాడిన మాటలు సరికావని పార్టీ అంతర్గత సంభాషణల్లోనే కాకుండా, బహిరంగంగానూ విమర్శలు వచ్చాయి. గతంలో షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై బహిరంగంగా స్పందించి.. ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడిన పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి కూడా పీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం క్రమశిక్షణ కమిటీ ముందు తన వివరణ కూడా ఇచ్చుకున్నారు. పార్టీ అంతర్గత విషయాలను మీడియా ముందుకు తీసుకెళ్లడం, తోటి నాయకుడిపై బహిరంగ విమర్శలు చేయడం కూడా క్రమశిక్షణా రాహిత్యమేనని భావించిన అధిష్టానం నోటీసులు పంపించినట్లు చర్చించుకుంటున్నారు.

## చండూరులో దొంగ నోట్ల కలకలం

**చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 13**



చండూరులో రూ.500 నకిలీ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. చండూర్ టౌన్ లోని శ్రీ మాధురి మిల్క్ సెంటర్ దగ్గరికి వచ్చి బెజవాడ రాజీవ్ అను వ్యక్తి దొంగ నోట్ల చలామణి చేస్తుండగా ఫిర్యాది అయిన ఆవుల కిరణ్ గమనించి సదరు వ్యక్తిని గట్టిగా అడగగా సదురు వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయంపై ఆవుల కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయనైనది గుర్తుతెలియని వ్యక్తి రూ.500 నోటుతో పాల ప్యాకెట్ కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో నోటు ఇచ్చినట్లు గుర్తించి సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలించారు. అనంతరం అదే వ్యక్తి మళ్లీ రావడంతో గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నోటు అసలుదనంపై విచారణ చేపట్టారు.

## నిరుద్యోగుల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు భూపతి శ్రీనివాసరావు ధ్వజం

భద్రాద్రి కొత్తగూడెం , జూన్ 13 :



ఎన్నికల ముందు నిరుద్యోగులకు అండగా ఉంటామని, ఉద్యోగాలిస్తామని రంగురంగుల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ఆ నిరుద్యోగుల పొట్ట కొట్టేలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు భూపతి శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. టీజీపీఎస్సీ ఫీజులను రూ. 200 నుండి ఏకంగా రూ. 1,000 కి పెంచడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, నిరుద్యోగ లోకం తరపున ఆయన ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. గత ప్రభుత్వం ఫీజుల పేరుతో ఇబ్బంది పెట్టిందని విమర్శలు గుప్పించిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఏకంగా ఐదు రెట్లు ఫీజులు పెంచడం నిరుద్యోగులను నిలువునా దగా చేయడం కాదా అని భూపతి నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మార్పు వస్తుందని చెప్పారని, అయితే ఈ మార్పు అంటే నిరుద్యోగులను దోచుకోవడమేనా అని ఆయన ఆక్షేపించారు. "ఇదా మీరు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం.. ఇదా మీరు తెచ్చిన మార్పు?" అంటూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వసూలు చేస్తున్నది అప్లికేషన్ ఫీజులా లేక అక్రమ వసూళ్లా అని భూపతి దుయ్యబట్టారు. ఒక సామాన్య నిరుద్యోగి గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఇలా నాలుగైదు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే కేవలం ఫీజుల కోసమే రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం రాకముందే నిరుద్యోగుల ఇళ్లను గుల్ల చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ చూస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించిన భూపతి, భృతి ఇవ్వకపోగా నిరుద్యోగులపై ఈ ఫీజుల భారం మోపడం తీవ్ర అన్యాయమన్నారు.

## టీ టి యు ఎఫ్ జెఈసీ మెంబర్ కు సన్మానం



కామారెడ్డి, జూన్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కామారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నూతనంగా ఎన్నికైన ముదాం శివశంకర్ ను దోమకొండ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల జిల్లా కార్యవర్గంలో రెండవసారి ఏకాగ్రీవంగా ఎన్నికవ్వడం గొప్ప విషయం అన్నారు. రాబోవు రోజుల్లో ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ కదిరే గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## న్యాయవాదులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి



కొత్తగూడెం: జూన్ 13 తెలంగాణ పత్రిక



జిల్లా న్యాయ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతూ కొత్తగూడెం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ జె. శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామవరం వద్ద నిర్మిస్తున్న నూతన కోర్టు భవన సముదాయంలో న్యాయవాదులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులకు సరైన వసతులు కల్పించడం ద్వారా న్యాయ సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పాపం.. బడి పంతుళ్లు...!

-లెక్కలేని సెలవులు.. లెక్కకు రాని పనులు
-సెలవులు అన్నమాటే గానీ, సర్వం పనులు
-పనులు చేయించుకోవడంలో ప్రథమ స్థానం
-ప్రభుత్వ ఉద్యోగులందరిలో ప్రత్యేక స్థానం
-అలవెన్సు వర్తింపుల్లో అందరిలో ఆఖరి స్థానం
-ప్రభుత్వం గుర్తించడంలోనే అలసత్వం
-నిర్వేదంలో తెలంగాణ ఉపాధ్యాయ లోకం
-వేసవిలోనూ మాస్టర్లకు తప్పని డ్యూటీలు
-అదనపు శిక్షణలు,అడ్మిషన్ల బాధ్యతలు
-ఉపాధ్యాయ వర్గాల్లో ఆవేదన, ఆందోళన




తెలంగాణ పత్రిక జూన్ 13 లక్షెట్టిపేట:

ఉపాధ్యాయులు..పంతుళు .మాస్టార్లు..టీచర్లు..సార్లు..ఇలా ఎన్నో పేర్లతో పిలవచ్చే..అంతేస్థాయిలో వీరు వివిధ రకాల పనులు,విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.టీచర్లా.. వాళ్లకేంటీ 365 రోజుల్లో 180 రోజులే పని చేస్తారు.ఏడాది వేతనాలు తీసుకుంటారనే భావన జనమందరిలో నాటుకుపోయింది. మోసే వాడికే కావడి బరువు తెలుస్తుందన్నట్టు వారు ఎదుర్కొంటున్న బాధలు మరో ఉపాధ్యాయుడికే అర్థమవుతాయి. సెలవుల విషయంలో తప్ప ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మధ్య చాలా వైరుధ్యాలు ఉంటాయనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రజా సంబంధమైన పలు కార్యక్రమాలకు ప్రభుత్వాలు ఉపాధ్యాయులనే ఉపయోగించుకుంటారని అందరికీ తెలిసిందే.మరి ఉద్యోగులు వారికి హోదాకు తగిన విధులే నిర్వర్తిస్తుంటారు.అయినా ఉపాధ్యాయులంటే.. అన్ని సెలవులే అనే అభిప్రాయాలపై టీచర్ల వర్గంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. సెలువుల్లో విద్యార్థులకు బండెడు ఇంటిపని ఎలా ఉంటుందో? తమ పరిస్థితి కూడా అలాగే ఉందని ఉపాధ్యాయ లోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎండలో సమాజం బాట ప్రస్తుతం వేసవికాలంలో ఎండలు దంచి కొడుతున్నాయి.అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లకూడదని ప్రభుత్వం,వైద్య నిపుణులు సూచిస్తున్నారు.ఎండల వేళ పాటించాల్సిన జాగ్రత్తలను పదేపదే వల్లిస్తున్నారు.ఈ సూచనలు ప్రస్తుతం జనాభా లెక్కల కోసం సమాజం బాట పట్టిన ఉపాధ్యాయులకు వర్తించవా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏడాదికి అదనంగా ఒక్క నెల అలవెన్సుగా అదనపు వేతనం పొందుతున్న ఉద్యోగులు,ఆఫీసుల్లో ఏసీ గదుల్లో పని చేస్తుంటే... ఎండలో తిరుగుతున్న ఉపాధ్యాయులకు వెకేషన్ డిపార్ట్మెంట్ అనే ట్యాగ్ వేసి.. అలవెన్సుల్లో ఉద్యోగులకంటే తక్కువ చూడడం ఎంతవరకు సమంజసం అనే వాదనలు వినిపిస్తున్నాయి.సెలవులు ఇచ్చినట్టే ఇచ్చి..శిక్షణ తరగతులు, ఎన్నికల విధులు,జనాభా లెక్కలు, అడ్మిషన్లు,ఆఫీసు పనులు,సర్వేలు, సంతకాలు అంటూ ఉపాధ్యాయుల శ్రమను వాడుకుంటున్న ప్రభుత్వాలు...అలవెన్సుల విషయంలో ఉద్యోగుల కంటే చులకనగా చూడడం తగదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. అలవెన్సుల వర్తింపులో ప్రభుత్వ ఉద్యోగులందరినీ (ఉపాధ్యాయుల సహా) ఒకేవిధంగా చూడాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సెలవుల్లో తేడా ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువగా ఉంటాయనేది వాస్తవమే. అంతేకాదు,టీచర్లకు సెలవుల రోజుల వేతనం (ఏడాది మొత్తం) కూడా ప్రభుత్వం కట్టిస్తుంది.ఇదిలా ఉంటే..ప్రభుత్వ ఉద్యోగులకు 12నెలలతో పాటు అదనంగా ఒక నెల వేతనం పొందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా ఏ ఉద్యోగికైనా ఏడాదికి క్యాజువల్ లీవులు (సీఎల్),ఎర్న్ లీవులు (ఈఎల్స్) కేటాయిస్తారు.ఇవి కాక,పండుగలు, జాతీయ స్థాయి వేడుకల కు ప్రత్యేక హాలీడేస్ ఉంటాయి.అయితే, ఉపాధ్యాయులకు మాత్రం ఈఎల్స్ ఉండవు.ఈ ఈఎల్స్ ను ప్రభుత్వ ఉద్యోగులు ఏడాది ముగింపులో ప్రభుత్వానికి సరెండర్ చేస్తుంటారు. అందుకు ప్రభుత్వం సుమారు 30 రోజులు అంటే అదనంగా ఒక నెల వేతనం చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వ సర్వీస్ రూల్స్ వెల్లడిస్తున్నాయి. హాలీడేస్ కాదు..కూలీడేస్ ఈఎల్స్ మినహాయిస్తే..ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు పండుగలు,జాతీయ స్థాయి వేడుకలు,సెలవులు ఒకేలా ఉంటాయి.అయితే ఉపాధ్యాయులకు వీటితోపాటు వేసవి సెలవులు దాదాపు 45 రోజులు అదనంగా పొందుతారు. అందుకే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉపాధ్యాయ వర్గాన్ని వెకేషన్ డిపార్ట్ మెంట్గా ముద్రవేశారు. అయితే,ఈ లెక్కలు ఎలా ఉన్నా.. ఎక్కువ హాలీడేస్ అన్నమాటే గానీ.. అవి కూలీ డేస్ గా మారు తున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రజాసంబంధమైన పలు కార్యక్రమాలకు ఉపాధ్యాయులనే వినియోగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.ఉదాహరణకు ప్రస్తుతం తెలంగాణలో జనాభా లెక్కల కార్యక్రమం కొనసాగుతున్నది.ఈ బాధ్యతలను ప్రభుత్వం ఉపాధ్యాయులకే అప్పగించింది.ఇదొక్కటే కాదు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సం ఖ్యను పెంచే బాధ్యతలు కూడా ఉపాధ్యాయుల మీదే పడ్డాయి.ఈ మేరకు టీచర్లు ఏటా వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్దేశించిన బడిబాట కార్యక్రమం కూడా నిర్వహించాల్సి వస్తోందని అందరికీ తెలిసిందే.ఇంకా సెలవుల్లోనే ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తుంటారని తెలుస్తోంది. సెలవుల్లో విద్యార్థులకు ఇంటి పని ఇచ్చినట్లుగా..ప్రభుత్వం ఉపాధ్యాయులకు పలు రకాల పనులు అప్పగించడం..ఎక్కువ సెలవులు అన్నమాటకు అర్థమే లేకుండా పోయిందని పలువురు పంతుళ్లు వాపోతున్నారు. బోధనతోపాటు భోజన బాధ్యతల్లోనూ అయినా ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువే అనుకున్నా.. విధుల విషయంలో ఉద్యోగుల కంటే ఉపాధ్యాయులపై పని భారం ఎక్కువగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సాధారణంగా ఉద్యోగులు..తమకు నిర్దేశించిన విధులకే పరిమితమవుతారు.కానీ, ఉపాధ్యాయులు తమ ప్రధాన విధి బోధనతోపాటు పాఠశాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.ఈ విధులు ఒక ఎత్తయితే, మధ్యాహ్న భోజన నిర్వహణ ఉపాధ్యాయులే చూసుకోవాల్సి ఉంటుంది. భోజనానికి అవసరమైన వస్తువుల సేకరణ,వినియోగానికి సంబంధించి, రికార్డులు మెయింటెన్ చేయాలి. వాటికి సంబంధించిన బిల్లుల కోసం మండలం, జిల్లా విద్యా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాలి. బిల్లుల విడుదలకు ట్రెజరీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉంటుంది.ఇక విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూసుకోవడం తలకు మించిన భారమని అందరికీ తెలిసిందే.ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజులు సెలవులిచ్చి.. అసౌకర్యాల నడుమ ఎన్నికల విధులు కూడా వారికే అప్పగించడం..అదనపు భారమే కదా.ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగానే శ్రమిస్తున్నారని స్పష్టమవుతోంది. అయినా ఉపాధ్యాయ వర్గం వెకేషన్ డిపార్ట్మెంట్గానే ముద్రపడింది. సెలవుల్లో కూడా వేతనం తీసుకుంటున్నందున ఉద్యోగులకు వర్తిస్తున్న ఈఎల్స్ కు ఉపాధ్యాయులను అనర్హులుగా గుర్తించి.. 'ఆచార్యదేవో భవ' సూక్తిని నిజం చేస్తున్నారా? నిట్టూర్చుతున్నారా? ప్రభుత్వమే సెలవివ్వాలి.

## కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

-యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి.
-కలెక్టర్ చిత్రా మిశ్రా.

తెలంగాణ పత్రిక జూన్ 13 కరీంనగర్ :



నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమంలో పాల్గొన్న నాయకుల కలయిక ఎంతో ఉద్యమ స్ఫూర్తి





**-ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకులు కాచం సత్యనారాయణగుప్త**
**-ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాయకుల భేటీ!**

రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ప్రతినిధి

ఉద్యమంలో పాల్గొన్న నాయకుల కలయిక ఎంతో ఆనందదాయకమని డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ మళ్లీ ఉద్యమించే సమయం ఆసన్నమైందని అనిపిస్తుంది అన్నారు. ఆంధ్ర పెత్తందారి రాజకీయ నాయకులు మళ్లీ తెలంగాణ ను ఆంధ్రాలో కలపాలనే దురుద్దేశంతో ఉన్నట్టు కనపడుతున్న సమయంలో నాటి ఉద్యమ నాయకులందరూ మళ్లీ ఏకతాటిపై సమిష్టి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నాయకుల కుగుర్తింపు కార్డులను అందజేశారు. ఈనాటి సమావేశంలో పాల్గొన్న ముఖ్య నేతలు తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాణాల శ్యాంసుందర్రావు, రాష్ట్ర కోశాధికారి ఊరే ప్రసాదరావు, ప్రచార కార్యదర్శి గూడ జయరాం, అక్కినేపల్లి వెంకటేశ్వరరావు ఈసీ మెంబర్ చకిలం నరసింహారావు తదితర నాయకులకు కాచం సత్యనారాయణ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేయడం జరిగింది.

# ధర్మపురి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్

తెలంగాణ పత్రిక జూన్ 13జగిత్యాల:

జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# బి.ఎల్.ఎ లతోనే కాంగ్రెస్ పటిష్టత





**-ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న**

తెలంగాణ పత్రిక జూన్ 13 ఖమ్మం

మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : కాంగ్రెస్ పార్టీని పటిష్టంగా మార్చగలిగే బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందని భద్రాచలం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులో నిర్వహించిన బి.ఎల్.ఎ కార్యకర్తల శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి తోటా దేవి ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ బి.ఎల్.ఎ అంటే పార్టీకి దిక్సూచి వంటి వారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే సైనికులు మీరే. ఓటర్ల జాబితా నుండి పోలింగ్ రోజు విధుల వరకు మీ పాత్ర కీలకం. కాంగ్రెస్ పటిష్టత అంటే బి.ఎల్.ఎ ల పటిష్టతే" అని అన్నారు. "ప్రతి బూత్‌లో కనీసం 5 మంది క్రియాశీలక కార్యకర్తలు ఉండాలి. 18సం నిండినకొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు చేర్చే బాధ్యత మీదే" అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, డిసిసి జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, మైబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ నరసారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, డిసిసి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మందా హనుమంతు, జిల్లా కార్యదర్శి నూకల రంగారావు, కార్యవర్గ సభ్యులు నరహరి, బట్టు మురళి మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో బి.ఎల్.ఎ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఎల్ఆర్ డఎన్ వి ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో జిపిఎల్ సెక్షన్ 02 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం

**-యువత క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలి ఎమ్మెల్యే బిఎల్ఆర్**



మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 13:(తెలంగాణ పత్రిక):-

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గౌట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నందు బిఎల్ ఆర్ డ ఎన్విఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నూకల చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన జీపీల్ సెక్షన్ -02 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత జట్లకు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు..గ్రామీణ స్థాయిలో యువత ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నూకల చారిటబుల్ ట్రస్ట్, బి ఎల్ ఆర్ డఎన్ వి ఆర్ బ్రదర్స్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబుకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



అన్నపురెడ్డిపల్లి ప్రతినిధి: జూన్ 13 (తెలంగాణ పత్రిక)

ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు ను అన్నపురెడ్డిపల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మల్లెల నరసింహారావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లెల నరసింహారావు దంపతులు తమ పెద్ద కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను మువ్వా విజయ్ బాబుకు అందజేసి, వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మువ్వా విజయ్ బాబు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వివాహ జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

## 17న జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**-రూ. 14,000 కోట్లతో 'హ్యామ్' రోడ్ల పనులకు శంకుస్థాపన..**
**-కనగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ..**
**-ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**



చండూరు తెలంగాణ పత్రిక జూన్ 13

?నల్లగొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 17వ తేదీన నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో రహదారుల రూపురేఖలను మార్చేలా.. రూ. 14,000 కోట్ల భారీ వ్యయంతో 'హ్యామ్' (నాూవీ) పద్ధతిలో చేపట్టనున్న డబుల్ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా కనగల్ మండల కేంద్రంలో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కనగల్‌లో సీఎం సభా స్థలి, హెలిప్యాడ్, పైలాన్ నిర్మాణ స్థలాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు."

# అక్రమ ఇసుక రవాణాపై వైరా పోలీసుల ఉక్కుపాదం..

**వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు.. అక్రమార్కులపై హిస్టరీ షీట్లు తెరిచేందుకు చర్యలు చెపట్టిన.. వైరా ఏసీపీ సారంగపాణి**




తెలంగాణ పత్రిక జూన్ 13 ఖమ్మం

వైరా పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ...ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి చెందిన సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తరలిస్తూ.... ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తూ.. వ్యవస్థీకృత కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఇసుక మాఫియాపై వైరా పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దొనబండ రీచ్ నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు, ఈ-వే బిల్లులు లేకుండా సుమారు 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఖమ్మంకు చెందిన చల్లమల్ల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చల్లమల్ల సుమంత్ కుమార్, అలాగే లారీ డ్రైవర్ కొండేటి ఉపేందర్లను అరెస్టు చేశారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన అశోక్ లేలాండ్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన మహీంద్రా థార్ కారు, విక్రయాల కోసం ఉపయోగిస్తున్న టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి, ఖమ్మం మరియు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించారు. ఈ సందర్భంగా నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, చల్లమల్ల సుమంత్ కుమార్‌పై మొత్తం 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వాటిలో పలు కేసుల్లో శిక్షలు కూడా విధించబడ్డాయి. అదేవిధంగా, చల్లమల్ల వెంకటేశ్వరరావుపై ప్రస్తుతం నమోదైన ఈ కేసుతో కలిపి మొత్తం 4 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా అక్రమ ఇసుక రవాణా, దొంగతనం, మోసం వంటి నేరాల్లో వీరు ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న ఇటువంటి వ్యక్తులపై హిస్టరీ షీట్లు ప్రారంభించడం, నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, అవసరమైతే రౌడీ షీట్లు తెరవడం వంటి కఠిన చర్యలు చేపట్టబడతాయి.

**వైరా పోలీసుల కఠిన హెచ్చరిక**

అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, కొనుగోలు లేదా విక్రయాలలో పాల్గొనే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, సహకరించే మధ్యవర్తులు ఎవరైనా సరే చట్టం ముందు తప్పించుకోలేరు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే, పర్యావరణాన్ని దెబ్బతీసే ఇటువంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, వాహనాలను స్వాధీనం చేసుకోవడం, హిస్టరీ షీట్లు తెరవడం, పునరావృత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటి చర్యలు కచ్చితంగా అమలు చేయబడతాయి.ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణా లేదా వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి చట్ట పరిరక్షణలో భాగస్వాములు కావాలని వైరా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

అక్రమ ఇసుక మాఫియాకు వైరా పోలీసుల స్పష్టమైన హెచ్చరిక -- చట్టాన్ని ధిక్కరించే వారికి కఠిన శిక్షలు తప్పవు. అక్రమ ఇసుక రవాణా ఏ రూపంలోనైనా సహించబడదు ని ఏసీపి సారంగపాణి తెలిపారు . ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకటప్రసాద్, ఎస్సైలు పుష్పల రామారావు, పవన్ కుమార్, సూరజ్, నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సర్కార్‘మహా’ నిధులు

**-దేవాలయాల అభివృద్ధికి**
**-బాసర టు భద్రాచలం ఆధ్యాత్మిక కారిడార్.. 802 కోట్ల రూపాయలతో సుందరీకరణ**

తెలంగాణ పత్రిక జూన్ 13 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో

ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు,రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ...’పీపుల్స్ మార్చ్’ పాదయాత్ర పూర్తయిన మూడేళ్ల సందర్భంగా పిప్పిరిలో నిర్వహించిన సభలో గూడెంగుట్ట ఆలయ అభివృద్ధి పనుల ప్రస్తావన వచ్చిందన్నారు. ఆ సభ జరిగిన 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి,ఎ ఈరోజు భూమిపూజ నిర్వహించడం ప్రజాప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. దాదాపు 70 కోట్ల రూపాయల భారీ నిధులతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి మరియు ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను ఆయన వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రాష్ట్రములోని ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం 2,216 కోట్లు రూపాయ లు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. గతంలో మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించా మన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరిం చుకుని భక్తులకు అవసరమైన వసతులు,ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో 1,000 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు.



**బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్**

గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం 802 కోట్లు రూపాయల కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రజల నమ్మకాలను, వారి కోరికలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ ముందుకు సాగుతోంద న్నారు. లిఫ్ట్ ఇరిగేషన్.. వ్యవసాయానికి ప్రాణం ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందులో భాగంగా గూడెంగుట్ట పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) పనుల కోసం 74 కోట్లు రూపాయలను కేటాయించి,ఈరోజు భూమి పూజ చేసుకోవడం శుభపరిణామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఆధ్యాత్మికత మరియు సాగునీటి రంగాల అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును భట్టి విక్రమార్క మనస్ఫూర్తిగా అభినందించారు. కేవలం అధికార హోదాను అనుభవించడం కాకుండా, నిరంతరం ప్రజల కోసం సేవ చేయడమే ప్రజాప్రతినిధి బాధ్యత అని ప్రేమ్‌సాగర్ రావు నిరూపిస్తున్నారన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కూడా ప్రేమ్ సాగర్ రావు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి పనిచేస్తున్నారని కొనియాడారు.చివరగా, గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి, రాబోయే రోజుల్లో జరిగే ప్రారంభోత్సవ మహోత్సవంలో కూడా మనమందరం ఇదే ఉత్సాహంతో పాల్గొందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని, దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట సంబంధిత అధికారులు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

తెలంగాణ పత్రిక నిజామాబాద్, జూన్ 13 :

జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచిం చారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారు లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరా వుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాల ని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందిం చడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరం తర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకో వాలని అన్నారు. ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ



పడకూ దని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశా లల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయు తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాల ల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపా యాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువ ంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటి స్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తా నని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ కు, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తది తరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి ఇందిరానగర్‌లో డ్రైనేజీ, నాలా సమస్యలపై బీజేపీ నేత రవికుమార్ యాదవ్ పర్యటన

**-శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలం తక్షణ చర్యలు తీసుకోవాలి**

సంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, జూన్ 13,(తెలంగాణ పత్రిక)





శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి డివిజన్, గచ్చిబౌలి గ్రామంలోని ఇందిరానగర్ ప్రాంతంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న నాలా, డ్రైనేజీ సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ శనివారం స్థానిక ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గచ్చిబౌలి గ్రామంలోని పలు ప్రాంతాలు మురుగునీటితో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంజయ్యనగర్ నుంచి వచ్చే నాలాను రాడిసన్ హోటల్ సమీపంలోని నాలాలో కలపడం వల్ల ఇప్పటికే ఉన్న సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాన్ని పరిశీలించిన రవికుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరానగర్‌లో నాలా, డ్రైనేజీ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోందని, ఎన్నోసార్లు జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు. అంజయ్య నగర్ నాలా సహజంగా పి.జె.ఆర్ నగర్ వైపు వెళ్లాల్సి ఉండగా, దానిని గచ్చిబౌలి గ్రామం మీదుగా వెళ్లే నాలాలో కలపడం వల్ల మురుగునీటి ప్రవాహం పెరిగి స్థానిక ప్రజలకు మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యలతో సతమతమవుతున్న ప్రాంతంలో సరైన ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలు భారీగా పెరిగాయని, అందుకు అనుగుణంగా నాలాల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాత్కాలిక చర్యలతో కాలయాపన చేయకుండా, భవిష్యత్తులో వరదలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత ప్రణాళికను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, నాయకులు ఓబుల్ రెడ్డి, మఖన్ సింగ్, నరసింహ, మహేందర్ యాదవ్, శశాంక్, రోహిత్, జైహింద్, మధు, రాఘవాచారి, రఘునాథ్, సుబ్రమణ్యం, దినేష్, రాము తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు హాజరై తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు..

## జగిత్యాల జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు జగిత్యాల ఐఎంఏ ముందడుగు

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 13

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 న నిర్వహించనున్న యాంటీ డ్రగ్ 3కే రన్ కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకంమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశం సనీయమని పేర్కొన్నారు. రన్ స్ట్రాంగ్ లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని వివేకానంద మినీ స్టేడియ ం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ ఆకుతోట



శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజం లోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని,యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్,డాక్టర్ ఎనుగుర్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

# బిజినెస్

## ప్రపంచంలో తొలి ట్రిలియనీర్ మస్క్ అతడి సంపదతో ఏమేం కొనొచ్చంటే..




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరో చారిత్రాత్మక ఘనత సాధించారు. స్పేస్‌ఎక్స్ మార్కెట్ అరంగేట్రం విజయవంతం కావడంతో ఆయన వ్యక్తిగత సంపద ఒక ట్రిలియన్ డాలర్లను దాటేసింది. దీంతో ప్రపంచ చరిత్రలో తొలి ట్రిలియనీర్‌గా మస్క్ కొత్త రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ అంచనాల ప్రకారం ఆయన నికర సంపద 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.105 లక్షల కోట్లు. అంటే, రూ.కోటి కోట్ల పైమాటే ఒక ట్రిలియన్ డాలర్లు అంటే 1 తర్వాత 12 సున్నాలు ఉంటాయి. ఈ మొత్తాన్ని ఈ భూమి మీద ఉన్న 820 కోట్ల మందికి పంచితే.. ఒక్కొక్కరికి రూ.11 వేలకు పైనే అందుతాయి. అమెరికాలో ప్రస్తుతం ఒక ఇంటి సగటు ధర ఆధారంగా చూస్తే, 1 ట్రిలియన్ డాలర్లతో సుమారు 25 లక్షల ఇళ్లను కొనుగోలు చేయవచ్చు. ఇది అనేక దేశాల మొత్తం గృహ మార్కెట్ విలువతో సమానం. ఒక ట్రిలియన్ డాలర్లు అనేది మస్క్ స్వదేశమైన దక్షిణాఫ్రికా వార్షిక జీడీపీకి రెట్టింపు కంటే ఎక్కువ ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నోట్లను ఒకదాని చివర మరొకటి కలిపి పేర్చితే అవి దాదాపు 97 మిలియన్ మైళ్ల దూరం వరకు విస్తరిస్తాయి. ఇది చంద్రుడి పైకి 200 కంటే ఎక్కువ సార్లు వెళ్లి రావడానికి పట్టే దూరానికి సమానం. ఇక, మస్క్ వ్యక్తిగత సంపద ఈ ప్రపంచంలో దాదాపు 170 దేశాల వార్షిక జీడీపీ కంటే చాలా ఎక్కువ. ప్రస్తుతం 21 దేశాల జీడీపీ మాత్రమే ట్రిలియన్ డాలర్ల మార్కును దాటింది ప్రస్తుతం ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ బిలియనీర్లు అయిన లారీ పేజ్, సెర్గే బ్రిన్, జెఫ్ బెజోస్, లారీ ఎల్లిసన్‌ల సంపదలను కలిపినా అవి మస్క్ సంపదను అధిగమించలేవు. స్పేస్‌ఎక్స్ శుక్రవారం తన షేర్లను అమెరికాలోని నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేసింది. ఐపీఓ ధర 135 డాలర్లతో పోలిస్తే.. 11 శాతం ప్రీమియంతో 150 డాలర్ల వద్ద లిస్టయింది. వెంటనే షేరు 160 డాలర్ల స్థాయిని కూడా దాటింది. దీంతో మస్క్ వ్యక్తిగత సంపద భారీగా పెరిగింది.

# స్పోర్ట్స్

## ఆస్ట్రేలియా ఓపెన్: సెమీస్‌లో సింధు ఓటమి




ఇంటర్నెట్ డెస్క్:

ఆస్ట్రేలియా ఓపెన్ 2026 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీ ఫైనల్‌లోనే నిష్క్రమించింది. శనివారం జరిగిన సెమీస్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, జపాన్ స్టార్ అకానె యమగుచి చేతిలో సింధు వరుస గేమ్‌ల్లో పరాజయం పాలైంది. 22-20, 21-12 తేడాతో సునాయస విజయం సాధించిన యమగుచి ఫైనల్‌కు దూసుకెళ్లింది.మ్యాచ్ ఆరంభంలో సింధు అద్భుత ఆటతో ఆకట్టుకుంది. దూకుడైన షాట్లతో ఆధిక్యంలో నిలిచిన ఆమె తొలి గేమ్‌లో యమగుచికి గట్టి పోటీ ఇచ్చింది. బ్రేక్ సమయం వరకు మ్యాచ్‌పై పట్టు సాధించినట్లు కనిపించినా.. ఆ తర్వాత క్రమంగా పట్టు కోల్పోయింది. తొలి గేమ్ చివరి దశలో సింధు 20-20తో సమం చేసి ఆశలు రేకెత్తించింది. కానీ ఆ తర్వాతి గేమ్‌లో యమగుచి రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. రెండో గేమ్‌లో సింధు వేగం పెంచే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వరుస పాయింట్లతో యమగుచి భారీ ఆధిక్యం సంపాదించింది. వరుసగా 7 పాయింట్లు సాధించి 13-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన యమగుచి.. ఆపై వెనక్కి తిరిగి చూసుకోకుండా 21-12 తేడాతో సునాయస విజయం సాధించింది. దీంతో యమగుచి వరుసగా నాలుగో టూర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

## ఎవరిపై ఓడినా పర్వాలేదు.. పాక్‌పై మాత్రం గెలవాలి: జెమీమాతో వాచ్‌మెన్

ఇంటర్నెట్ డెస్క్:

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 ఇప్పటికే మొదలైంది. ఆదివారం టీమిండియా తన తొలి మ్యాచ్‌ను బర్మింగ్‌హామ్ వేదికగా పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు భారత స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భారత్-పాక్ మ్యాచ్ అంటే అభిమానుల అంచనాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించింది. ఈ క్రమంలో తన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌తో జరిగిన ఓ సంభాషణను గుర్తు చేసుకుంది.నేను మొదటిసారి పాక్‌తో మ్యాచ్ ఆడినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లో మా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాతో మాట్లాడింది. భారత్-పాక్ మ్యాచ్ అంటే బయట నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, అభిమానుల అంచనాలు చాలా ఎక్కువగా ఉంటాయని చెప్పింది. అంతేకాకుండా మా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కూడా.. 'ఎవరిపైన ఓడినా పర్వాలేదు.. కానీ పాకిస్థాన్‌పై మాత్రం ఓడొద్దు. ఆ మ్యాచ్‌లో మనం తప్పకుండా గెలిచి తీరాలి' అని చెబుతుంటాడు. ఈ మ్యాచ్‌పై ప్రజలకు ఎంత ఆసక్తి ఉంటుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు' అని జెమీమా వెల్లడించింది.

**-అదే మా లక్ష్యం..**

'ప్రపంచ కప్ ట్రోఫీని గెలిచిన దృశ్యాన్ని మేమంతా ప్రతిరోజూ ఊహించుకుంటాం.




జట్టుగా కూర్చొని ఆ విజన్‌ను మనసులో పెట్టుకుంటాం. ఒక లక్ష్యాన్ని నిరంతరం ఊహిస్తే దానివైపు ప్రయాణం మొదలవుతుందని మేము నమ్ముతాం. వన్డే ప్రపంచ కప్ సమయంలో కూడా ఇదే విధానాన్ని అనుసరించాం. అందుకే కప్ నెగ్గాం. ప్రతి మ్యాచ్‌కు వేర్వేరు ప్రణాళికలతో సిద్ధమవుతాం. ప్రాక్టీస్‌లోనే ఒత్తిడితో కూడిన పరిస్థితులను సృష్టించుకుని వాటిని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాం. మ్యాచ్‌లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను ముందుగానే అనుభవిస్తే అసలు పోటీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఆశించిన ఫలితాలు రాకపోయినా, ఆ ఓటముల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం' అని జెమీమా వివరించింది.

## భారత్, అఫ్గాన్ తొలి వన్డేకు పొంచి ఉన్న వాన ముప్పు!

స్పోర్ట్స్ డెస్క్:

భారత్, అఫ్గానిస్థాన్ మధ్య మూడు వన్డేల సిరీస్ నేటి నుంచి ప్రారంభం కానుంది. శనివారం ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చాలా కాలం తర్వాత టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బ్లూ జెర్సీలో కనిపించనున్నాడు. అయితే రోహిత్ ఆట చూద్దామనుకునే అభిమానులకు నిరాశే ఎదురయ్యేలా ఉంది. ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు తీవ్రంగా పొంచి ఉంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, మ్యాచ్ జరిగే సమయంలో దాదాపు 90 శాతం వర్షం పడే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉండటంతో మ్యాచ్‌కి తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది.శుక్రవారం సాయంత్రం నుంచి ధర్మశాలలో వర్షం పడుతుంది. ఇవాళ ఉదయం కూడా కాసేపు చిన్నపాటి వర్షం కురిసింది. మరోసారి మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల మధ్య భారీగా వర్షం



కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు, ఉరుములు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఇవాళ ఒకవేళ వర్షం అంతరాయం కలిగిస్తే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని అమలు చేసే అవకాశం ఉంది.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నినాదం



## ఓటీటీలోకి 'దృశ్యం 3'.. ఎక్కడ? ఎప్పుడు?



మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది. మే 21న విడుదలైన ఈ చిత్రం నెల రోజులు పూర్తికాకముందే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రానుంది.'దృశ్యం 3' డిజిటల్ హక్కులను నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ నుంచి ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాల్లో ఒకేసారి స్ట్రీమ్ చేయనున్నారు.దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథను కొత్త కోణంలో ఆవిష్కరించారు. గత రెండు భాగాల మాదిరిగా వరుస ట్విస్టులపై కాకుండా జార్జ్‌కుట్టి పాత్ర ఎదుర్కొనే నైతిక సంఘర్షణలు, కుటుంబాన్ని కాపాడేందుకు అతడు ఎంతదూరమైనా వెళ్లే పరిస్థితులను ప్రధానంగా చూపించారు.బాక్సాఫీస్ వద్ద కూడా 'దృశ్యం 3' భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.234.97 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం విదేశాల్లోనే రూ.111.50 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది.

# వందే భారత్‌లో ప్రయాణం.. పాత రోజులు గుర్తుచేసుకుని ఎమోషనల్ అయిన సోనూ సూద్



ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా భారతీయ రైల్వే సాధించిన ప్రగతిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా వేదికగా తన అనుభవాలను పంచుకున్నారు. ప్రస్తుతం వందే భారత్ రైలులో ప్రయాణిస్తున్నానని పేర్కొన్న సోనూ సూద్, దేశంలోని రైల్వే వ్యవస్థ ఇంతగా అభివృద్ధి చెందడం గర్వకారణమని అన్నారు. రైలులోని ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన ఆహారం, సిబ్బంది ప్రవర్తన, ప్రయాణికులకు అందిస్తున్న సేవలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ ప్రయాణం తన మొదటి రైలు ప్రయాణాన్ని గుర్తు చేసిందని ఆయన చెప్పారు. నాగ్‌పూర్‌లో చదువు పూర్తి చేసిన తర్వాత నటుడు కావాలనే కలతో ముంబైకి వెళ్లిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో రైళ్లలో రిజర్వేషన్ కూడా దొరకక, పొడవాటి కంప్యూటర్ పేపర్లను మడతపెట్టి జనరల్ బోగీల్లో ప్రయాణించేవాళ్లమని తెలిపారు. రాత్రిళ్లు పడుకోవడానికి చోటు లేక రైలు టాయిలెట్‌ల దగ్గర నేలపై పేపర్లు పరుచుకుని నిద్రించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. అప్పటికీ, ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చిందని, వందే భారత్ వంటి అత్యాధునిక రైళ్లను నడిపే స్థాయికి భారతీయ రైల్వే చేరుకోవడం గొప్ప విషయమని సోనూ సూద్ కొనియాడారు. సామాన్య ప్రజల ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చిన రైల్వే శాఖకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దేశ అభివృద్ధిలో రైల్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇలాంటి మంచి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# ఒకే రోజు 12 షార్ట్ ఫిల్మ్స్.. 82 ఏళ్ల అమితాబ్ స్పీడ్‌కు ఫ్యాన్స్ ఫిదా!


**-రెండు స్టిల్ ఫోటోషూట్లు కూడా ముగింపు**
**-82 ఏళ్ల వయసులోనూ అదే జోష్‌తో పని**
**-ప్రస్తుతం 'కల్కి 2898 AD' సీక్వెల్‌లో బిజీ**

అభిమానులతో అనుబంధమే తనకు ముఖ్యమన్న బిగ్‌బీవయసు కేవలం సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించారు బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్. 82 ఏళ్ల వయసులోనూ యువ హీరోలకు ఏమాత్రం తీసిపోని ఉత్సాహంతో పనిచేస్తున్న బిగ్‌బీ.. ఒకే రోజులో 12 షార్ట్ ఫిల్మ్స్ షూటింగ్‌తో పాటు రెండు స్టిల్ ఫోటోషూట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. తన అభిమానులను 'ఎక్స్‌టెండెడ్ ఫ్యామిలీ'గా పిలిచే అమితాబ్ తన బ్లాగ్‌లో ఈ విషయాన్ని పంచుకున్నారు. "పని అంటే పనే. ఈ రోజు 12 షార్ట్ ఫిల్మ్స్ షూట్ చేశాను. రెండు స్టిల్ షూట్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడు మీతో కనెక్ట్ అవుతున్నాను. మిగతావన్నీ కొనసాగుతూనే ఉంటాయి. కానీ ఈ అనుబంధం మాత్రం ఆగకూడదు" అంటూ రాసుకొచ్చారు. పని విషయంలో రాజీ పడకూడదని కూడా పేర్కొన్నారు. రోజూ కొత్తగా నేర్చుకుంటూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని బ్లాగ్‌లో చెప్పారు. ప్రస్తుతం నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లో అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల ఆయన 'వెట్టాయన్' చిత్రంలో నటించారు. టి.జె. జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రజినీకాంత్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు



వారియర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

## 'దృఢమ్' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!



మలయాళంలో 'షేన్ నిగమ్' కి మంచి క్రేజ్ ఉంది. ఆయన పోలీస్ ఆఫీసర్ గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృఢమ్'. జీతూ జోసెఫ్ శిష్యుడు 'మార్టిన్ జోసెఫ్' ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. జీతూ జోసెఫ్ సమర్పకుడిగా వ్యవహరించాడు. అందువలన ఈ సినిమాపై ఆయన మార్క్ కనిపిస్తుంది. మే 8వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 12వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో కలుపుకుని ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. విజయ్ (షేన్ నిగమ్) 'పాలక్కడ్' కి చెందిన యువకుడు.తల్లిదండ్రుల కోరిక మేరకు అతను పోలీస్ ఆఫీసర్ అవుతాడు. ఫస్టు పోస్టింగ్ పై, అడవిని అనుకుని ఉన్న ఓ విలేజ్ కి వెళతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ స్టాఫ్ గా, కృష్ణన్,బాలన్, సత్యన్, ఆనంద్, విద్య, రమ్య ఉంటారు. కృష్ణన్ మాత్రం పదవీ విరమణకు దగ్గరలో ఉంటాడు. అందరూ కూడా విజయ్ ను ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటారు. క్వార్టర్స్ లో సరదాగా గడుపుతూ ఉంటారు. అలాంటి సమయంలోనే ఆ విలేజ్ కి సంబంధించిన ఆయా ప్రదేశాలలో ఒక్కొక్కటిగా శవాలు బయటపడుతూ ఉంటాయి. గుర్తుపట్టలేనంత దారుణమైన స్థితిలో ఆ శవాలు ఉంటాయి. అందరూ కూడా తల వెనుక భాగంలో బలమైన గాయం ఏర్పడిన కారణంగా చనిపోయారనే విషయం పోస్టు మార్టం నివేదికలో వెల్లడవుతుంది. అదే సమయంలో ఒక ఫైనాన్స్ కంపెనీ నుంచి 120 సవర్ల బంగారం .. 50 లక్షల నగదు మాయమవుతుంది.

# 'మెగా158' సెట్స్‌లో సందడి.. నటి నివేదా పేతురాజ్ కోసం కేక్ కటింగ్

**-నటి నివేదా పేతురాజ్ సినీ రంగంలోకి వచ్చి పదేళ్లు పూర్తి**
**-మెగా158 సెట్లో కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన చిత్ర యూనిట్**
**-ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న #Mega158**

చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం ఇదిమెగాస్టార్ చిరంజీవి హీరోగా, యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం చవీవస్త్రు158. ఈ సినిమా సెట్స్‌లో నటి నివేదా పేతురాజ్‌కు చిత్ర యూనిట్ ఒక స్పెషల్ సర్ప్రైజ్ ఇచ్చింది. నివేదా సినీ రంగంలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె కోసం ప్రత్యేకంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అభినందనలు తెలిపింది. ఈ వేడుకకు సంబంధించిన వీడియోను నివేదా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. అందులో ఆమె సహనటి అనస్వర రాజన్‌తో పాటు ఇతర చిత్ర బృంద సభ్యులకు కేక్ తినిపిస్తూ కనిపించారు. 'ఒరు నాల్ కూతు' అనే తమిళ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన నివేదా పేతురాజ్, దశాబ్ద కాలంగా తన కెరీర్‌లో విజయవంతంగా కొనసాగుతున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని 'మెగా158' టీం ఆమెను గౌరవించడం విశేషం. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలక షెడ్యూల్ తమిళనాడులోని పొల్లాచ్చిలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు బాబీ కొల్లి తెలిపారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో చవీవస్త్రు158పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటం టైనర్‌లో యువ నటి అనస్వర రాజన్ మరో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా కోసం మెగాస్టార్ చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోను ఇటీవలే విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్', 'డాకు మహారాజ్' వంటి చిత్రాలకు పనిచేసిన విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటో గ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. కొల్ల అవినాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.



Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143